


ఆర్ఎన్ఐ/2009/ 28733

స్థాపితం : 2003

# ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి : 22 సంచిక: 47 తిరుపతి తేది : ఆదివారం 17 మే 2026 పేజీలు : 08 ధర : రూ.6 PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISRICTS

# ఇది వైపరీత్యాల దశాబ్ది

- కోవిడ్..యుద్ధాలు..ఇంధన సంక్షోభం
- నెదర్లాండ్స్ పర్యటనలో ప్రధాని వ్యాఖ్యలు

ద హేగ్ – ఆంధ్రనాడు, మే 16



ప్రపంచం ప్రస్తుతం అనేక సంక్షోభాలను ఎదుర్కొంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పునరుద్ఘాటించారు. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులతో శనివారం నిర్వహించిన సమావేశంలో భారత పురోగతి, ప్రపంచ సవాళ్లు, భారత్– నెదర్లాండ్స్ సంబంధాలు తదితర అంశాలపై ప్రసంగించారు. ఈ దశాబ్ది ఆరంభంలోనే కరోనా మహమ్మారి వచ్చిందని, ఆ తర్వాత యుద్ధాలు ప్రారంభమయ్యాయని, ఇప్పుడు ఇంధన సంక్షోభం ప్రపంచాన్ని వేధిస్తోందని తెలిపారు. ఈ దశకం ప్రపంచానికి వైపరీత్యాల (డిజాస్టర్ల) దశాబ్దిగా మారుతోందని ఆయన వ్యాఖ్యానించారు. పరిస్థితులు త్వరగా మారకపోతే గత ఎన్నో దశాబ్దాల అభివృద్ధి ఫలితాలు చెదిరిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ జనాభాలో అనేక మంది పేదరికంలోకి జారిపడే పరిస్థితి రావచ్చన్నారు. ఇక్కడి ప్రవాస భారతీయుల ఉత్సాహం చూస్తుంటే తాను భారత్‌లోని ఏదో పండుగలో పాల్గొన్నట్లుగా అనిపించిందని ప్రధాని వ్యాఖ్యానించారు. నెదర్లాండ్స్ నాయకత్వంతో ఎప్పుడు మాట్లాడినా అక్కడి భారతీయుల కృషి, ప్రతిభ గురించి ఎంతో ప్రశంసిస్తారని చెప్పారు. ది హేగ్ నగరం

- మిగతా 2లో..

# జులై ఒకటి నుంచి త్రిభాషా విధానం

## - సీబీఎస్ఈ కీలక నిర్ణయం..

న్యూఢిల్లీ – ఆంధ్రనాడు, మే 16



సీబీఎస్ఈ కీలక నిర్ణయం తీసుకుంది. తొమ్మిది, పది తరగతి విద్యార్థులకు త్రిభాషా విధా నాన్ని తప్పనిసరి చేసింది. జులై ఒకటి నుంచి ఇది అమల్లోకి వస్తుందని వెల్లడిం చిం ది. సీబీఎస్ఈ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం.. ఆ మూడు భాషల్లో రెండు భారతీయ భాషలు ఉండాలి. మూడు భాషలను అధ్యయనం చేయాలి. ఇక పదో తరగతి విద్యార్థులకు ఒక ఊరట కల్పించింది. మూడో భాషకు బోర్డ్ ఎగ్జామ్ ఉండదని వెల్లడించింది. వారు భాషాధ్యయనంపైనే దృష్టి సారించేలా.. అనవసర ఒత్తిడి తగ్గించేందుకే

- మిగతా 2లో..

# మూడో బిడ్డను కంటే రూ.30 వేలు, నాలుగో బిడ్డకు రూ.40 వేలు...

- పిల్లలే సంపద' పేరుతో జనాభా పెరుగుదలకు ఏపీ సర్కార్ కొత్త పథకం
- జనాభా తగ్గితే ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్న సీఎం చంద్రబాబు
- పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీని ప్రకటించిన ప్రభుత్వం
- శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో ముఖ్యమంత్రి ప్రకటన

నరసన్నపేట – ఆంధ్రనాడు, మే 16



జనాభా పెరుగుదలను ప్రోత్సహించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రాష్ట్రంలో మూడో సంతానానికి రూ. 30 వేలు, నాలుగో సంతానానికి రూ. 40 వేల చొప్పున ప్రోత్సాహకం అందించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. 'పిల్లలే సంపద' పేరుతో త్వరలోనే ఈ కొత్త కార్యక్రమాన్ని

- మిగతా 2లో..

# నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' ప్రారంభం

- పరిశుభ్రత, పేదరిక నిర్మూలన, జనాభా పెరుగుదల, భూ రికార్డుల ప్రక్షాళనే తన ప్రాధాన్యతలని స్పష్టం చేసిన సీఎం
- రాష్ట్రవ్యాప్తంగా 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన చంద్రబాబు
- ఉత్తరాంధ్ర నుంచి వలసలు పోవద్దు, ఉత్తరాంధ్రకే వలసలు రావాలన్నదే తన సంకల్పమని వెల్లడి
- గత ప్రభుత్వ పాలనను 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణిస్తూ, విధ్వంసానికి, అభివృద్ధికి ఉన్న తేడాను గమనించాలని ప్రజలకు పిలుపు
- నరసన్నపేట నియోజకవర్గానికి పలు అభివృద్ధి పనులను మంజూరు చేస్తూ వేదికపై నుంచే హామీ




నరసన్నపేట – ఆంధ్రనాడు, మే 16

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరిగిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' ప్రజా వేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రభుత్వ దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. తన మనసుకు దగ్గరైన నాలుగు కార్యక్రమాలే రాష్ట్ర భవిష్యత్తుకు మూలస్తంభాలని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రాన్ని పరిశుభ్రంగా మార్చే 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర', పేదలకు అండగా నిలిచే సంక్షేమ పథకాలు, జనాభా సమతుల్యత, భూ రికార్డుల ప్రక్షాళన తన జీవితాశయమని

- మిగతా 2లో..



# బండి భగీరథ్ అరెస్ట్

## - పేట్ బషీరాబాద్ స్టేషన్‌కు నిందితుడి తరలింపు, విచారణ

హైదరాబాద్ – ఆంధ్రనాడు, మే 16

మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో బండి భగీరథ్‌ను శనివారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ శివారు నార్సింగిలోని పోలీసు అకాడమీ వద్ద ఆయనను అదుపులోకి తీసుకున్న పోలీసులు పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించి పోక్సో కేసుకు సంబంధించి విచారించారు. భగీరథ్ అరెస్ట్‌లో జాప్యాన్ని తప్పుబడుతూ ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగడంతో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు పోలీసులు కూడా అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. నిందితుడు దేశం విడిచి వెళ్లకుండా శనివారం పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. నిందితుడితో టచ్‌లో ఉన్న వారిపై, స్నేహితులు,

- మిగతా 2లో..

# ఇంధన పొదుపుపై ప్రత్యేక దృష్టి

- మంత్రి గొట్టిపాటి
- 6 లక్షల పేద కుటుంబాలకు ఉచితంగా 'సూర్య ఘర్' కనెక్షన్లు
- ఎస్సీ, ఎస్టీలకు పూర్తి సబ్సిడీ అందించాలని సీఎం ఆదేశం
- పునరుత్పాదక ఇంధనంతో ఛార్జీల తగ్గింపునకు చర్యలు
- గత ప్రభుత్వం మోపిన భారాన్ని తగ్గించడమే లక్ష్యం

అమరావతి– ఆంధ్రనాడు, మే 16



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్ర బాబు మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఇంధన పొదుపు, పునరుత్పాదక ఇంధన వినియోగంపై ప్రత్యే కంగా దృష్టి సారించినట్లు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. భవిష్యత్ అవసరా లను దృష్టిలో పెట్టుకుని సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు, విద్యుత్ ఛార్జీలు తగ్గించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆయన స్పష్టం చేశారు. శనివారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, శిలాజ ఇంధనాల దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు గట్టిగా సంకల్పించారని తెలిపారు. ఇందులో భాగంగానే పగటిపూట సౌరశక్తిని వినియోగించుకునేలా ప్రజలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. దేశంలో

- మిగతా 2లో..

# నా వ్యాఖ్యలను వక్రీకరించారు

- జస్టిస్ సూర్యకాంత్
- నకిలీ, బోగస్ డిగ్రీలతో వృత్తిలోకి ప్రవేశించే వారిని ఉద్దేశించి వ్యాఖ్యానించినట్లు వెల్లడి
- భారత యువత పట్ల తాను గర్వపడుతున్నానన్న జస్టిస్ సూర్యకాంత్

అమరావతి– ఆంధ్రనాడు, మే 16



కొంతమందిని తాను పరాన్నజీవులుగా లేదా బొద్దింకలుగా పోల్చిన వివాదంపై భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పందించారు. ఒక కేసు విచారణ సందర్భంగా మౌఖికంగా చేసిన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని ఆయన వివరణ ఇచ్చారు. నకిలీ, బోగస్ డిగ్రీలతో ఈ వృత్తిలోకి వచ్చేవారిని ఉద్దేశిస్తూ తాను ఆ వ్యాఖ్యలు చేశానని అన్నారు. ఇలాంటి వారే మీడియా, సోషల్ మీడియాతో పాటు ఇతర రంగాల్లోకి చొరబడ్డారని అన్నారు. అందుకే అలాంటి వారిని పరాన్నజీవులుగా పేర్కొన్నట్లు తెలిపారు. కానీ మీడియాలో కొందరు

- మిగతా 2లో..

ఆదివారం
17.05.2026
తిరుపతి – చిత్తూరు
అన్నమయ్య– అనంతపురం
ఆంధ్రనాడు

# ఇది వైపరీత్యాల దశాబ్ది

(మొదటిపేజీ తరువాయి)

భారత్– నెదర్లాండ్స్ స్నేహానికి సజీవ చిహ్నంగా మారిందని పేర్కొన్నారు. తరాలు మారినా, దేశాలు మారినా భారతీయ కుటుంబ విలువలు, సంస్కృతి మారలేదని కొనియాడారు. డచ్ భాషను స్వీకరించినా తమ మూల భాషలను, సంప్రదాయాలను ప్రవాస భారతీయులు వదల్లేదని అభినందించారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో ప్రపంచ దేశాలు రెసిలియెంట్ సప్లై చైన్?పై దృష్టి పెడుతున్నాయని ప్రధాని తెలిపారు. భారత్, నెదర్లాండ్స్ కలిసి విశ్వసనీయమైన, పారదర్శకమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన సరఫరా వ్యవస్థను రూపొందించేందుకు కృషి చేస్తున్నాయని చెప్పారు. డిజిటల్ చెల్లింపుల్లో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచిందని ప్రధాని మోదీ తెలిపారు. ప్రస్తుతం దేశంలో నెలకు 20 బిలియన్ డాలర్ల విలువైన డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయని చెప్పారు. ఒకప్పుడు కేవలం నాలుగు యూనికార్న్ కంపెనీలు మాత్రమే ఉండగా ఇప్పుడు 100కు పైగా ఉన్నాయని వెల్లడించారు. సెమీకండక్టర్ రంగంలో భారత్ కీలక ముందడుగు వేసిందని ప్రధాని స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో భారత్ ప్రతిష్ఠ పెరుగుతోందని ప్రధాని మోదీ చెప్పారు. ఎఐ సమ్మిట్, జి20 సమావేశాలను భారత్ విజయవంతంగా నిర్వహించగలిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో 90 కోట్ల మంది ఓటర్లుగా నమోదై ఉన్నారని చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 64 కోట్ల మంది ఓటు వేశారని వెల్లడించారు. ఇయు దేశాల మొత్తం జనాభాను కలిపినా 64 కోట్ల మంది ఉండరంటూ భారత ప్రజాస్వామ్య విస్తృతిని తెలిపారు. ప్రపంచానికి ప్రజాస్వామ్యానికి భారత్ మాతృదేశమని పేర్కొన్నారు.

**రాజు విలియం అలెక్జాండర్‌తో భేటీ**

నెదర్లాండ్స్ పర్యటనలో భాగంగా శనివారం నాడు ఇక్కడి రాయల్ ప్యాలెస్‌లో రాజు విలియం -- అలెగ్జాండర్, రాణి మెక్సిమాతో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. భారత్ -- నెదర్లాండ్స్ మధ్య సాంకేతికత, ఆవిష్కరణ, సుస్థిరాభివృద్ధి, వాణిజ్య, జలవనరుల వంటి రంగాల్లో స్నేహబంధం మరింత బలోపేతానికి తమ భేటీ ఉపయోగపడిందని మోదీ చెప్పారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ఆయన పోస్టు చేశారు. ప్రయోజనాల పరస్పర పంపిణీ, విశ్వ అవసరాలకు తగినవిధంగా భవిష్యత్ నిర్మాణంలో పరస్పర విశ్వాసం ఆధారంగా భారత్ -- నెదర్లాండ్స్ అనుసంధానమైవున్నాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా చోళుల కాలం నాటి తామ్ర వస్తువులను నెదర్లాండ్స్ ..భారత్‌కు అప్పగించింది.

# జులై ఒకటి నుంచి త్రిభాషా విధానం

(మొదటిపేజీ తరువాయి)

ఈ ఏర్పాటు అని బోర్డ్ పేర్కొంది. ఆ పాఠ్యాంశానికి పాఠశాలల్లో చూపే ప్రతిభ ఆధారంగానే మార్కులు కేటాయిస్తారు. జాతీయ విద్యా విధానం(ఎన్‌ఈపీ)లో ఈ త్రిభాషా విధానం భాగం. విద్యార్థులు మూడు భాషలు నేర్చుకోవాలని ఎన్‌ఈపీ–2020 సిఫారసు చేస్తోంది. ఇందులో కచ్చితంగా రెండు భారతీయ భాషలుండాలి. ఈ ఫార్ములా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలన్నింటికీ వర్తిస్తుంది. అయితే విద్యార్థులకు నేర్పాల్సిన భాషలేమిటన్నది నిర్ణయించుకునే అధికారం రాష్ట్రాలదే.

**విదేశీ భాషల సంగతేంటి?**

విద్యార్థులు మాధ్యమిక పాఠశాల స్థాయిలో భారతీయ భాషలు, ఆంగ్లంతోపాటు కొరియన్, జపనీస్, ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్ భాషలూ అభ్యసించవచ్చని ఎన్‌ఈపీ–2020 చెబుతోంది. అధిక శాతం పాఠశాలల్లో భాషా మాధ్యమంగా ఉన్న ఆంగ్లాన్ని విదేశీ భాషగా పరిగణిస్తారు. అందుకే ఈ భాషను ఎంచుకునే విద్యార్థులు రెండు భారతీయ భాషలను ఎంచుకోవాల్సి ఉంటుంది. రాజ్యాంగ నిర్దేశాలను, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంతోపాటు బహుభాషా తత్వాన్ని ప్రోత్సహించి జాతీయ సమైక్యతను సాధించేందుకే ఈ విధానామని ఎన్‌ఈపీ నిబంధనలు చెప్తున్నాయి.కాగా.. గతంలో ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని తమిళనాడు ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. ఇప్పుడు అక్కడ కొత్త ప్రభుత్వం కొలువుతీరింది. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు పిల్లలందరికీ హిందీ విధిగా బోధించాలని నిర్ణయించిన మహారాష్ట్ర ప్రభుత్వం.. తర్వాత విమర్శలు రావడంతో త్రిభాషా విధానం అమలుకు సంబంధించిన ఉత్తర్వులను వెనక్కి తీసుకున్న సంగతి తెలిసిందే.

# మూడో బిడ్డను కంటే రూ.30 వేలు, నాలుగో బిడ్డకు రూ.40 వేలు...

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించనున్నట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరిగిన 'స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ ప్రకటన చేశారు. జనాభా తగ్గుదల రేటు ఆందోళన కలిగిస్తోందని, దేశ ప్రగతికి పిల్లలే అసలైన సంపద అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. చాలా దేశాల్లో జనాభా తగ్గి వృద్ధుల సంఖ్య పెరగడం వల్ల ఆర్థిక వ్యవస్థలు దెబ్బతింటున్నాయని ఆయన గుర్తుచేశారు. గతంలో కుటుంబ నియంత్రణపై దృష్టి సారించామని, కానీ మారిన పరిస్థితుల్లో జనాభాను దేశానికి సంపదగా మార్చేందుకు 'పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ'ని తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కొత్త విధానం ద్వారా జననాల రేటును పెంచేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఇప్పటికే 'తల్లికి వందనం' కింద రూ.15 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని, తల్లీబిడ్డలకు పౌష్టికాహారం కోసం అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

# బండి భగీరథ్ అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

బంధువుల ఇళ్లపై నిఘా ఉంచారు. బంజారాహిల్స్‌లోని బండి సంజయ్ ఇంట్లో ఒక బృందం తనిఖీలు నిర్వహించింది. ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పు ఆలస్యమవుతుండటంతోపాటు రాజకీయంగా, వ్యక్తిగతంగా ఒత్తిడి పెరుగుతుండటంతో భగీరథ్ తండ్రి, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇరకాటంలో పడ్డారు. కాగా, ఈ కేసులో బాధితురాలు, ఆమె తల్లి వాంగ్మూలాలను మేడ్చల్ మెజిస్ట్రేట్ ఎదుట 40 నిమిషాల పాటు పోలీసులు రికార్డు చేశారు.

**బెయిల్ వస్తుందనే వెయిట్ చేశాం : బండి సంజయ్ ?**

తన కుమారుడికి బెయిల్ వస్తుందని ఇంతవరకూ వెయిట్ చేశామని బండి సంజయ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భగీరథ్ అరెస్టు అనంతరం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'వాస్తవానికి ఫిర్యాదు రాగానే పోలీస్ స్టేషన్లో అప్పగిద్దామని అనుకున్నా. బెయిల్ తప్పకుండా వస్తుందని లాయర్లు చెప్పారు. ఇంకా కేసులో జాప్యం చేయడం సరికాదనే ఉద్దేశంతో మా అబ్బాయిని లాయర్ల ద్వారా పోలీసుల విచారణకు అప్పగించాను. న్యాయవ్యవస్థపై నాకు సంపూర్ణమైన నమ్మకం ఉంది. వాస్తవానికి కోర్టు ఉత్తర్వులు సోమవారం వెలువడే అవకాశం ఉంది' అని ఈ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. కాగా, నిందితుడు భగీరథ్‌ను తామే లాయర్ల సమక్షంలో పోలీసులకు అప్పగించామని బండి సంజయ్ ప్రకటించగా... భగీరథ్‌ను పోలీసులు నార్సింగిలో అరెస్ట్ చేసినట్టు సైబరాబాద్ పోలీసు కమిషనర్ రమేష్ రెడ్డి చెప్పడం గమనార్హం.

# నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించి, రాష్ట్రాన్ని చెత్త రహితంగా మార్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

**నా జీవితాశయం ఇదే..**
**నాలుగు కార్యక్రమాలే నా ప్రాధాన్యం**

ప్రజల అభిమానాన్ని చూస్తుంటే ఎంత కష్టపడినా తక్కువేననిపిస్తోందని చంద్రబాబు తన ప్రసంగాన్ని ప్రారంభించారు. "నా మనసుకు దగ్గరైన నాలుగు కార్యక్రమాలు ఉన్నాయి. మొదటిది రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచే స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర. రెండోది నెల మొదటి తారీఖున పేదలకు పింఛన్లు అందించి వారి బాగోగులు తెలుసుకోవడం. మూడోది జనాభా నియంత్రణ పేరుతో గతంలో జరిగిన పొరపాటును సరిదిద్ది, పిల్లల్ని సంపదగా భావించడం. అందుకే మూడో బిడ్డకు రూ.30,000, నాలుగో బిడ్డకు రూ.40,000 అందిస్తున్నాం. నాలుగోది, గొడ్డలి పార్టీ నాశనం చేసిన భూ రికార్డులను బ్లాక్‌చైన్ టెక్నాలజీతో ప్రక్షాళన చేసి, 2027 మార్చి నాటికి భూతగాదాలు లేని రాష్ట్రంగా మార్చడం" అని తన లక్ష్యాలను వివరించారు.

స్వచ్ఛాంధ్ర ఉద్యమం.. 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' ప్రారంభం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం 17వ సారి నిర్వహిస్తున్నామని, దీని ద్వారా రాష్ట్రంలో మార్పు కనిపిస్తోందని చంద్రబాబు అన్నారు. "స్వచ్ఛత అంటే రోడ్లు, ఇళ్లు శుభ్రంగా ఉండటమే కాదు, మన ఆలోచనలు కూడా స్వచ్ఛంగా ఉండాలి. గత ఐదేళ్లలో రాష్ట్రంలో పేరుకుపోయిన 86 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వేస్ట్‌ను క్లియర్ చేయడానికి 23 నెలలు పట్టింది. జూన్ నాటికి రాష్ట్రంలో ఎక్కడా చెత్త లేకుండా చేసే బాధ్యత మాది" అని హామీ ఇచ్చారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్లు, వ్యర్థాల సేకరణకు 'స్వచ్ఛ రథం', పాఠశాలల్లో 'నెట్ జీరో' విధానం వంటి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు.

**ఉత్తరాంధ్ర నుంచి వలసలు కాదు.. ఉత్తరాంధ్రకే వలసలు రావాలి**

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. "ఒకప్పుడు దేశంలో ఏ నగరానికి వెళ్లినా శ్రీకాకుళం కాలనీ ఉండేది. ఈ పరిస్థితి మారాలి. ఉత్తరాంధ్ర నుంచి వలసలు పోవడం కాదు, ఉత్తరాంధ్రకే వలసలు రావాలి. ఇదే నా సంకల్పం" అని ఆయన స్పష్టం చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్, మూలపేట పోర్ట్, డేటా సెంటర్లు, ఐటీ కంపెనీలతో ఉత్తరాంధ్ర దశ, దిశ మారుతోందన్నారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులైన మధ్యవలస స్టేజ్–2, హీరమండలం ఎత్తిపోతల, వంశధార, జంఝావతి ప్రాజెక్టులను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని క్యాలెండర్ ప్రకటించారు. 60 ఏళ్ల కల అయిన నేరేడి బ్యారేజ్‌ను ఈ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేసి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**అవార్డుల అభినందనలు.. నరసన్నపేటకు వరాలు**

జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీలుగా నిలిచి అవార్డులు సాధించిన అధికారులను, ప్రజా ప్రతినిధులను చంద్రబాబు వేదికపై నుంచి అభినందించారు. దేశంలోనే 8 అవార్డులు సాధించి పంచాయతీరాజ్ శాఖ నంబర్ వన్‌గా నిలిచిందని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే రమణమూర్తి విజ్ఞప్తి మేరకు, నరసన్నపేటలోని రాజుల చెరువు ఆధునికీకరణ, ఓల్డ్ ఎన్హెచ్ రోడ్డు విస్తరణ, శ్రీముఖలింగం ఆలయ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహించడం వంటి పలు అభివృద్ధి పనులకు అక్కడికక్కడే ఆమోదం తెలిపారు. ఎర్రన్నాయుడు పార్క్ కేసును పరిష్కరించే బాధ్యతను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు అప్పగించారు.

**లెక్కలతోనే నా పాలన.. అధికారులకు మార్కులు, క్లాసులు**

తన ప్రసంగంలో భాగంగా ముఖ్యమంత్రి, శ్రీకాకుళం జిల్లా అధికారుల పనితీరుపై డేటాతో సహా సమీక్ష నిర్వహించారు. "50 ప్రభుత్వ సేవలపై ప్రజల సంతృప్తి రాష్ట్ర సగటు 72.96% ఉండగా, శ్రీకాకుళం జిల్లాలో 75.2% ఉండటం అభినందనీయం" అని కలెక్టర్‌ను, అధికార యంత్రాంగాన్ని ప్రశంసించారు. రీ–సర్వే, తాగునీరు, బీసీ వెల్ఫేర్ హాస్టల్స్ వంటి విభాగాల్లో మెరుగైన పనితీరు కనబరిచిన వారిని అభినందిస్తూనే, ఆర్టీసీ బస్ సర్వీసులు, గంజాయి నియంత్రణ, సీఎం రిలీఫ్ ఫండ్ అమలులో వెనుకబడిన శాఖల అధికారులను హెచ్చరించారు. పనితీరు మెరుగుపరుచుకోవాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**గొడ్డలి పార్టీతో జాగ్రత్త..**
**విధ్వంసం, అభివృద్ధికి తేడా ఇదే**

గత ప్రభుత్వ పాలనను 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణిస్తూ చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "అధికారం అంటే విధ్వంసం కాదు, ప్రజల జీవితాలను మార్చే అవకాశం. గత ఐదేళ్ల ప్రభుత్వ టెర్రరిజం, కబ్జాలు, అరాచకాలతో ఉత్తరాంధ్ర అభివృద్ధి కుంటుపడింది. బాబాయ్‌ని గొడ్డలితో చంపి, ఆ నింద నాపై వేసి ఎన్నికల్లో గెలిచారు. అలాంటి వారి కొత్త నాటకాలతో మళ్లీ వస్తారు, జాగ్రత్తగా ఉండాలి" అని ప్రజలను హెచ్చరించారు. విధ్వంసానికి, అభివృద్ధికి మధ్య ఉన్న తేడాను గమనించి, రాష్ట్ర భవిష్యత్తు కోసం అభివృద్ధికి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

# అమరావతికి యుద్ధ గండం...



**విజయవాడ – ఆంధ్రనాడు, మే 16**

ఆంధ్రప్రదేశ్ ప్రజల ఐదేళ్ల నిరీక్షణ తర్వాత, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అమరావతి పనులు మళ్లీ పట్టాలెక్కుతున్న తరుణంలో ఊహించని గ్లోబల్ సవాళ్లు ఎదురవుతున్నాయి. అమెరికా–ఇరాన్ ఉద్రిక్తతలు , పశ్చిమాసియాలో చెలరేగుతున్న యుద్ధ జ్వాలలు ఇప్పుడు అమరావతి నిర్మాణాల కొనసాగింపును మరోసారి ప్రశ్నార్థకం చేస్తున్నాయి. యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా సప్లై చెయిన్ దెబ్బ తినడం, చమురు ధరలు పెరగడం వంటి కారణాలతో కేంద్ర ప్రభుత్వం భారీ ప్రాజెక్టులపై ఆచితూచి అడుగులు వేయాలని భావిస్తోంది. ఈ క్రమంలో అమరావతి వంటి మెగా ప్రాజెక్టుల పురోగతిపై రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది.ప్రస్తుత అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని, భారీ నిర్మాణ పనులను కనీసం రెండేళ్ల పాటు వాయిదా వేయాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించవచ్చనే ప్రచారం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. ముఖ్యంగా ప్రధాని మోదీ ప్రకటించిన ఆస్టెరిటీ పాలసీలో భాగంగా ఖర్చులను తగ్గించుకోవాలని చూస్తుండటం అమరావతికి ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. ఈ ప్రచారాన్ని నీతి ఆయోగ్ తోసిపుచ్చినప్పటికీ, ఏపీలోని ప్రతిపక్షాలు దీనిని రాజకీయ అస్త్రంగా మార్చుకుంటున్నాయి. అమరావతి ఆగిపోతుందని అంటున్నారు. దీంతో రాజధాని నిర్మాణం మళ్లీ అటకెక్కుతుందా అనే ఆందోళన సామాన్య ప్రజల్లో నెలకొంది.అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధుల్లో సింహభాగం ప్రపంచ బ్యాంక్ , ఆసియా అభివృద్ధి బ్యాంక్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి రావాల్సి ఉంది. యుద్ధ పరిస్థితుల వల్ల అంతర్జాతీయ మార్కెట్లు అస్థిరంగా మారితే, ఈ రుణాల మంజూరులో జాప్యం జరిగే ప్రమాదం ఉంది. గ్లోబల్ ఎకానమీ కుదేలైతే బ్యాంకులు తమ ప్రాధాన్యతలను మార్చుకునే అవకాశం ఉంటుంది. ఇదే ఇప్పుడు చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి అతిపెద్ద తలనొప్పిగా మారింది. రాజకీయంగా చూస్తే, అమరావతిని తన ప్రతిష్టగా భావిస్తున్న చంద్రబాబుకు ఇది ఒక అగ్నిపరీక్ష. ఒకవైపు రాష్ట్రంలో ఆర్థిక వనరుల కొరత, మరోవైపు కేంద్రం నుంచి అందాల్సిన సహకారం .. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడం ఇప్పుడు ఆయన ముందున్న సవాల్. గతంలో పారిశ్రామికీకరణను పరుగులు పెట్టించిన అనుభవం ఉన్నప్పటికీ, ఇప్పుడు యుద్ధం వంటి బాహ్య శక్తుల ప్రభావం వల్ల ప్రాజెక్టు మందగిస్తే లక్ష్యం చేరుకోవడం ఆలస్యం అవుతుంది. అమరావతి చుట్టూ జరుగుతున్న రాజకీయం ఈ అనుమానాలను మరింత బలపరు స్తోంది. రాజధాని పనులు వాయిదా పడతాయనే ప్రచారం ద్వారా ఇన్వెస్టర్లలో భయాందోళనలు సృష్టించేందుకు కొన్ని వర్గాలు ప్రయత్నిస్తున్నాయని ప్రభుత్వం ఆరోపిస్తోంది. నిర్మాణ పనులు జోరుగా సాగుతున్ నసమయంలో ఇలాంటి ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదంటున్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఎటువంటి వాయిదా నిర్ణయాన్ని ప్రకటించలేదని కూటమి నేతలు గట్టిగా చెబుతున్నారు. నీతి ఆయోగ్ వివరణ కూడా ప్రభుత్వానికి కొంత ఊరటనిస్తోంది. కానీ, ప్రపంచ యుద్ధ మేఘాలు తొలగిపోనంత కాలం అమరావతి వంటి భారీ ప్రాజెక్టులపై నీలినీడలు కమ్ముకుంటూనే ఉంటాయన్నది సత్యం. ఏపీ రాజధాని కల నెరవేరాలంటే కేవలం రాష్ట్ర సంకల్పం మాత్రమే కాదు, అంతర్జాతీయ పరిస్థితులు కూడా అనుకూలించాల్సిన అవసరం కనిపిస్తోంది.

# ఇంధన పొదుపుపై ప్రత్యేక దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని పేదలకు 2 కిలోవాట్ల సామర్థ్యంతో 6 లక్షల 'సూర్య ఘర్' సోలార్ కనెక్షన్లను ఉచితంగా అందించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కేంద్రం దేశవ్యాప్తంగా కోటి కనెక్షన్లను లక్ష్యంగా పెట్టుకుంటే, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 20 లక్షల కనెక్షన్లు ఏర్పాటు చేయడమే ధ్యేయమని వివరించారు. కేంద్ర ప్రభుత్వం 2 కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లకు రూ.78 వేలు సబ్సిడీ ఇస్తోందని, దీనికి అదనంగా బీసీలకు రూ.20 వేలు, ఎస్సీ, ఎస్టీలకు పూర్తి సబ్సిడీగా రూ.1.25 లక్షలను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆసుపత్రులపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి, ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని గొట్టిపాటి పేర్కొన్నారు. గత రెండేళ్లుగా రూ.5,000 కోట్ల భారాన్ని ప్రభుత్వమే భరించి విద్యుత్ బిల్లులు పెరగకుండా చూసిందని గుర్తుచేశారు. గత ప్రభుత్వం ట్రూ–అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై మోపిన భారాన్ని తాము అధికారంలోకి రాగానే తగ్గించామని, ఇప్పటికే యూనిట్‌కు 13 పైసలు తగ్గించామని చెప్పారు. రాబోయే రోజుల్లో ఛార్జీలు మరింత తగ్గించడమే సీఎం లక్ష్యమన్నారు. తన ప్రోటోకాల్ వాహనాలను తగ్గించుకోవడం ద్వారా ఇంధన పొదుపును స్వయంగా ఆచరిస్తున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు సలహాలు, సూచనలతో క్లీన్ ఎనర్జీ అందించే దిశగా పనిచేస్తూ, ప్రపంచంలోని ఉత్తమ విద్యుత్ సంస్కరణలను అందిపుచ్చుకునే తొలి రాష్ట్రంగా ఏపీని నిలబెడతామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ధీమా వ్యక్తం చేశారు.

# నా వ్యాఖ్యలను వక్రీకరించారు

(మొదటిపేజీ తరువాయి)

తన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భారతీయ యువత పట్ల తాను ఎంతో గర్వపడుతున్నానని పేర్కొన్నారు. నిన్న ఓ కేసు విచారణ సందర్భంగా మౌఖికంగా చేసిన వ్యాఖ్యలను మీడియాలోని ఒక వర్గం వక్రీకరించిన తీరును చదివి తాను ఆవేదన చెందానని పేర్కొన్నారు. మన దేశ యువతను విమర్శించానని చెప్పడం పూర్తిగా నిరాధారమని అన్నారు. మన దేశ యువతను చూసి ఎంతో గర్వపడుతున్నానని పేర్కొన్నారు. తన పట్ల వారికి గౌరవ మర్యాదలు ఉన్నాయని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని అన్నారు. యువతను దేశాభివృద్ధికి మూలస్తంభాలుగానే చూస్తానని సూర్యకాంత్ తెలిపారు.

# ఏపీఐసెట్ ఫలితాలు విడుదల

**అమరావతి – ఆంధ్రనాడు, మే 16**



ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎపి ఐసెట్ ఫలితాలను మంత్రి నారా లోకేష్ శనివారం విడుదల చేశారు. మొత్తం 26,219 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 23,198 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 21,205 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. కాకినాడ జిల్లాకు చెందిన వైష్ణవి 166.094 మార్కులతో ప్రథమ ర్యాంక్ సాధించారు. అభ్యర్థులు తమ ర్యాంక్ కార్డులను https://cets.apsche.ap.gov.in / ICET/ICET/ICET_HomePage.aspx ద్వారా పొందవచ్చు.

# డెంగ్యూ దినోత్సవ ప్రదర్శన



**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 16 :** రేణిగుంట పట్టణంలో ప్రభుత్వ ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ దినోత్సవ ప్రదర్శన శనివారం నిర్వహించారు. జాతీయ డెంగ్యూ దినోత్సవ సందర్భంగా రేణిగుంట నందు మరియు కరకంబాడి గ్రామంలో రాస్ ఎన్జీవో సిబ్బంది మరియు విద్యార్థులతో కలిసి డెంగ్యూ వ్యాధి పై బ్యానర్ ప్రదర్శన, ప్రతిజ్ఞ,ర్యాలీ,డెంగ్యూ వ్యాధిపై అవగాహన సదస్సు కార్యక్రమాలు నిర్వహించుట జరిగినది.పరిసరాలు శుభ్రం చేయడం, కప్పి ఉంచుకోవడం అనే పద్ధతిలో దోమల పుట్టుక నివారణ జరగాలని హెల్త్ సూపర్వైజర్ కామరాజు కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి, సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటయ్య, హెల్త్ సూపర్వైజర్స్ బాబు, కామరాజు, ప్రకాష్, నాగరాజు సిబ్బంది, ఆశా కార్యకర్తలు, రాస్ రమేష్, భారతి, లీలాకృష్ణ మరియు ప్రజలు పాల్గొన్నారు.

# పరకాల ప్రభాకర్‌కు స్వాగతం



**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 16 :** రేణిగుంట విమానాశ్రయంలో పరకాల ప్రభాకర్ రాక సందర్భంగా నాయకులు స్వాగతం పలికారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన పరకాల ప్రభాకర్ కి తిరుపతి జిల్లా లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ పి.అంజయ్య, జిల్లా నాయకులు వందవాసి నాగరాజు, పి. మురళి, వాకా ప్రసాద్, రాఘవ, ఎం. నాగార్జున, కే. హరినాథ్ తదితరులు స్వాగతం పలికారు. భారత లౌకిక రాజ్యాంగకు ఏర్పడుతున్న ప్రమాదం గురించి రేపు తిరుపతి సదస్సులో పరకాల ప్రభాకర్ ప్రధాన ఉపన్యాసం చేయనున్నారు. సందర్భంగా ఎయిర్పోర్ట్‌కు వచ్చిన ఆయనకు నాయకులు సాదర స్వాగతం పలికారు.

# ఆధునిక పద్ధతులతో వ్యవసాయంలో అధిక దిగుబడి : డా జి. కృష్ణ రెడ్డి



**రామచంద్రాపురం – ఆంధ్రనాడు, మే 16:** ఆధునిక వ్యవసాయ పద్ధతులు అనుసరించటం వలన రైతులు అధిక దిగుబడి పొందవచ్చునని మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి కృష్ణారెడ్డి అన్నారు. రామచంద్రాపురం మండలంలోని మిట్టూరు గ్రామ కమ్యూనిటీ హాలులో ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము, తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, శ్రీ మేకపాటి మేకపాటి గౌతమ రెడ్డి వ్యవసాయ కలశాల, బి.ఎస్.సి. (అగ్రికల్చర్) నాల్గొవ సంవత్సరం విద్యార్థులు తమ గ్రామీణ వ్యవసాయ అనుభవ పథకం కార్యక్రమములో భాగంగా శనివారం రైతు సదస్సు మరియు వ్యవసాయ సాంకేతిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని రైతులకు వ్యవసాయ పద్ధతులపై విద్యార్థులు అవగాహన కల్పించడం, రైతులు చేస్తున్న వ్యవసాయ పద్ధతులను విద్యార్థులు తెలుసుకోవడం ఎంతో శుభపరిణామమన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారిణి బి మమత మాట్లాడుతూ రైతులందరూ ప్రకృతి వ్యవసాయం పై మక్కువ చూపాలని, సేంద్రియ ఎరువులను ఉపయోగించడం వల్ల నాణ్యతతో కూడిన పంట దిగుబడి లభిస్తుందన్నారు.రసాయన ఎరువులు వాడకంతో ఉత్పత్తి అయిన ఆహార ధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల అనారోగ్యం పాలు కావాల్సి వస్తుందని వివరించారు.అనంతరం వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో, ప్రాంతీయ వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ డి.భారతి, డాక్టర్ పి. మహేశ్వర రెడ్డి,డాక్టర్ . కె. విశ్వనాథ్,డాక్టర్ హారతి,డాక్టర్ భార్గవ రామి రెడ్డి, డాక్టర్ .కదిరి మోహన్ పాంగోని,డాక్టర్ కదిరి మోహన్,డాక్టర్ . ఎన్ సునీత,రైతులు పాల్గొన్నారు.

# ముందు జాగ్రత్తలతో డెంగీ నుంచి రక్షణ

## - వైద్యాధికారి నాగరాజు



**తంబళ్లపల్లి – ఆంధ్రనాడు, మే 16:** ముందు జాగ్రత్తలు తీసుకుంటే డెంగీ వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చని కోసువారిపల్లె ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి నాగరాజు అన్నారు. శనివారం కోసువారిపల్లెలో స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర, జాతీయ డెంగీ దినోత్సవాలను చేశారు. డెంగీ వ్యాధి లక్షణాలు, పరిశుభ్రత–ప్రాధాన్యత, దోమల వల్ల వ్యాప్తి చెందే జ్వరాలు, నివారణ చర్యలు, జాగ్రత్తలను వివరిస్తూ అవగాహన ర్యాలీ చేశారు. దోమలు వృద్ధి కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి నాగరాజు మాట్లాడుతూ.. డెంగీ జ్వరాన్ని కలిగించే ఈడిస్ ఈజిప్టి దోమలు ఏళ్ల ఆవరణాల్లోనే నివాసాలు ఏర్పరుచుకుంటాయన్నారు. పగటి పూట కూడతాయన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే.. డ్రైడే నిర్వహించి ఇళ్ల పరిసరాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కృష్ణా నాయక్, ఎంపీహెచ్ఈఓ ప్రమీల, ఏఎన్ఎం హాలీమా, ఆశా వర్కర్లు రామలక్ష్మి, తులసీ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 16 :** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యార్థుతోందని ఎంపీడీవో బాలాజీ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా బోధనలో శిక్షణా నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారని, బడి ఈడు పిల్లల్ని బడిలోనే చేర్చాలని, ఎక్కడా డ్రాప్ అవుట్సు ఉండరాదని, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని, ఉత్తమమైన విద్య కోసం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని, ఆధునిక బోధనా పద్ధతుల ద్వారా, అనేక వసతులతో, సౌకర్యాలతో గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎన్నో చర్యలు తీసుకుందని, అత్యుత్తమమైన విద్యా బోధన కోసం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలన్నారు. ఐసిడిఎస్, అంగన్వాడీ, వెలుగు సిబ్బంది గ్రామాలలో పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కలుగజేసి విద్యాభ్యాసం ఎవరికి ఎక్కడా కుంటు పడకుండా చూడాలని, ప్రభుత్వ పాఠశాలల సౌకర్యాల గురించి అందరికీ తెలియజేయాలని సమన్వయ సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం నీరజ, ఎంఈఓ గోపాల్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్వైజర్ కల్పన, వెలుగు సీసీలు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వచ్ఛ కుప్పం లక్ష్యంగా ముందుకు సాగుదాం....

**- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్**



**కుప్పం – ఆంధ్రనాడు, మే 16:** స్వర్ణాంధ్ర స్వచ్ భారత్ లో భాగంగా కుప్పం నియోజకవర్గాన్ని స్వచ్ఛ కుప్పం గా తీర్చిదిద్దడమే ఎన్ డి ఏ ప్రభుత్వ లక్ష్యమని అందులో భాగంగానే ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కడ పొలిటికల్ చైర్మన్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. శనివారం తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా కుప్పం పట్టణ ప్రధాన స్వచ్ఛ కుప్పం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారిలోని చెత్తను సేకరించి మునిసిపాలిటీ వాహనాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించాలంటే ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని సూచించారు. పరిశుభ్రత ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాలు శుభ్రంగా ఉండాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఆయన అన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిర్వహించే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛత కార్యక్రమాలకు యువత, మహిళా సంఘాలు, విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి నుంచి స్వచ్ఛతను ప్రారంభించాలని తెలిపారు. స్వచ్ కుప్పం కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, కడ సభ్యులు రాజ్ కుమార్, తిరుపతి గంగమ్మ దేవాలయం చైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు, కమిషనర్ శ్రీనివాసరావు, కే. కన్నన్, సత్యేంద్ర శేఖర్, గోపీనాథ్, సోమశేఖర్, ప్రమోద్ కుమార్, స్థానిక టిడిపి జనసేన బిజెపి నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీ ఫ్లైట్స్ ఏరో డ్రాముగా రాయలచెరువు

**: ఆకర్షవంతమైన పర్యాటక కేంద్రంగా మారనున్న రాయలచెరువు**

**: కంటైనర్లలో ఫుడ్ కోర్టులు ఏర్పాటుకు ప్రణాళికలు**



**రామచంద్రాపురం – ఆంధ్రనాడు, మే 15:** రాష్ట్రంలోనే అతి పెద్దదైన రాయల చెరువు సీ ఫ్లైట్స్ ఏరోడ్రమ్ గా మారనున్నట్లు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శనివారం ఏపీ టూరిజం, మరియు స్థానిక అధికారులు కూటమి పార్టీల నాయకులతో కలిసి ఎమ్మెల్యే నాని రాయలచెరువును సందర్శించారు. ఎమ్మెల్యే నానికి, అధికారులకు స్థానిక కూటమి పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. రాయల చెరువు కట్టను అధికారులతో కలిసి ఎమ్మెల్యే రిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని



చేతల ప్రభుత్వమని చెప్పారు. 2021లో చెరువు నిండు కుండగా మారిన సందర్భంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాయల చెరువును సందర్శించారని గుర్తు చేశారు. ఆ సమయంలోనే రాయలచెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చారని తెలిపారు. తాను ఇక్కడి పరిస్థితులను పరిశీలించిన మీదట వాటర్ స్పోర్ట్స్‌లో శిక్షణ ఇప్పించే ఏర్పాట్లు చేసినట్లు, దాని ఫలితంగా మన మండలానికి చెందిన యువతకే కాక పలు ప్రదేశాల యువతకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ విజయాలు కలిగాయన్ని వివరించారు. ముఖ్యమంత్రి రాయలచెరువు ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంలో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖతో మాట్లాడి సీ ఫ్లైట్స్ ఏరోడ్రం నిర్మించడానికి క్లియరెన్స్ వచ్చినట్లు ఎమ్మెల్యే తెలియజేశారు. .ఎందుకో అవసరమయ్యే భవన నిర్మాణాల కోసం స్థల సేకరణ చేయనున్నట్లు చెప్పారు. రాయల చెరువు కట్ట పైన అందమైన గార్డెన్ తో పాటు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేయడానికి పంచాయతీలకు అవకాశం కల్పించే విషయాన్ని కూడా పరిశీలిస్తామన్నారు. రాయలచెరువు లో సీ ఫ్లైట్స్ ఏరోడ్రాం ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందడమే కాక, స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడనున్నట్లు వివరించారు. రాయల చెరువు కట్ట నుంచి పరమాల వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టడానికి అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గం కూటమి ప్రభుత్వ పాలనలో అన్ని విధాల అభివృద్ధి చెందుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి టూరిజం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ రమణ ప్రసాద్, తిరుపతి జిల్లా టూరిజం అధికారి ఎం జనార్దన్ రెడ్డి, తాశీల్దారు మధుసూదన్ రావు, ఎంపీడీవో గిడ్డయ్య, మండల విద్యాశాఖ అధికారి మార్కండేయనాయుడు, శాఖాధికారిణి మమత, మండల టిడిపి అధ్యక్షులు తిరుమలరెడ్డి, రామచంద్రాపురం సింగల్ విండో అధ్యక్షులు చేకూరి జనార్దన్ చౌదరి, మాజీ ఎంపీపీ కేశవుల నాయుడు, సీనియర్ నాయకులు కొట్టే నరసింహా రెడ్డి, కోరా హరి ప్రసాద్, ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, రామిరెడ్డి ధనంజయ రెడ్డి, ఢిల్లీ ప్రసాద్ రెడ్డి, రాయల చెరువు నీటి సంఘం అధ్యక్షులు త్యాగరాజులు, ఏఎంసి డైరెక్టర్ దద్దాల రదీష్, ఆళ్లమడుగు కృష్ణారెడ్డి, రవికుమార్, మాధవయ్య, మహేష్ నాయుడు, తులసి బాబు, లెక్కల సురేంద్ర, బాధూరు కోటీశ్వర్ రెడ్డి, కుప్పా రెడ్డి, తానికొండ మురళి నాయుడు, విజయ కుమార్ రెడ్డి, సోమురాయల్, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.



# విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సోషల్ మీడియా ఉద్యమం

- మూడో పార్టీ విధానం రద్దు చేయాలని ఏఈసీఈఏ జి-3045 యూనియన్ డిమాండ్



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 16:** ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఈసీఈఏ) జి–3045 యూనియన్ రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మీడియా ఉద్యమాన్ని ప్రారంభించింది. మే డే సందర్భంగా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో భాగంగా కార్మికులు విద్యుత్ సంస్థలో కొనసాగుతున్న మూడో పార్టీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున ప్రచారం చేపడుతూ, ఉప ముఖ్యమంత్రి, మంత్రి నారా లోకేష్‌ను ట్యాగ్ చేస్తూ ప్రభుత్వ దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్తున్నారు. ఈ సందర్భంగా ఏఈసీఈఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్ మాట్లాడుతూ, ఈ సోషల్ మీడియా ఉద్యమాన్ని ప్రతి డివిజన్, సబ్ డివిజన్ స్థాయికి విస్తరించి కార్మికుల్లో అవగాహన, చైతన్యం పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర కమిటీ ప్రారంభించిన ఈ సోషల్ మీడియా ఛాలెంజ్‌కు జిల్లాల వారీగా మంచి స్పందన లభిస్తోందని ఆయన పేర్కొన్నారు. తిరుపతి నియోజకవర్గ నాయకులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని ఛాలెంజ్‌ను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. కార్మికులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ ఉద్యమంలో భాగస్వామ్యం అవుతున్నారని ఆయన వివరించారు. త్వరలోనే ఈ ఉద్యమాన్ని రాష్ట్రంలోని 13 జిల్లాలకు విస్తరించనున్నట్లు ఏఈసీఈఏ జి–3045 రాష్ట్ర కమిటీ ప్రకటించినట్లు సుధాకర్ వెల్లడించారు.

# పోషణ సేవల బలోపేతంపై దృష్టి

- సిఎంఏఎం అమలు, పోషకాహార లోపం పిల్లలపై ప్రత్యేక సమీక్ష




**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 16:** విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ (విసిఎఫ్), టాటా ట్రస్ట్స్ సహకారంతో తిరుపతిలోని హోటల్ గోల్డెన్ ట్యూలిప్‌లో సిఎంఏఎం (సమాజ ఆధారిత తీవ్రమైన పోషకాహార లోపం నిర్వహణ) జిల్లా సమీక్ష, మార్గదర్శక సమావేశం నిర్వహించారు. సమావేశంలో సిఎంఏఎం కార్యక్రమ అమలుపై సమగ్ర సమీక్ష నిర్వహించడంతో పాటు జిల్లాలో గుర్తించబడుతున్న తీవ్ర (ఎస్ఏఎం), మధ్యస్థ (ఎమ్ఏఎం) పోషకాహార లోపం ఉన్న పిల్లల పరిస్థితిపై విస్తృతంగా చర్చించారు. గత ఒకటిన్నర సంవత్సరంలో కార్యక్రమ పురోగతిని అధికారులు అంచనా వేశారు. ఎస్ఏఎం పిల్లలను వేగంగా గుర్తించి అవసరమైన వారిని ఎన్ఆర్‌సికి తక్షణమే రిఫర్ చేయడం, నిరంతర ఫాలోఅప్ నిర్వహించడం, ఆరోగ్య స్థితిని పర్యవేక్షించడం, కేసుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే పోషకాహార లోపం ఉన్న పిల్లలకు సమయానుకూల సేవలు అందించడంలో ఎటువంటి ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు అభిప్రాయపడ్డారు. గ్రామస్థాయిలో సిఎంఏఎం కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరాన్ని సమావేశం స్పష్టం చేసింది. ఈ సమావేశంలో ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. సుబ్రహ్మణ్యం, ఐసిడిఎస్ నోడల్ అధికారి వసంత బాయి, ఎన్ఆర్‌సి వైద్య నిపుణులు డా. అంజన్ బాయి, ఎస్వియు ప్రొఫెసర్ మంజుల, విసిఎఫ్ ప్రతినిధులు, జిల్లాలోని సిడిపిఓలు, సూపర్‌వైజర్లు, టాటా ట్రస్ట్స్ ప్రోగ్రామ్ అసోసియేట్స్ పాల్గొన్నారు.

# పర్యావరణ రక్షణకు ప్లాస్టిక్ తగ్గింపు తప్పనిసరి

- స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో డీఎంహెచ్‌ఓ పిలుపు



**తిరుపతి రూరల్ – ఆంధ్రనాడు, మే 16:** ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి రాష్ట్రాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి. బాలకృష్ణ నాయక్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ., ఒక్కసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్ కవర్లు, బ్యాగుల వల్ల పర్యావరణంతో పాటు మనుషులు, జంతువులకు కూడా హాని కలుగుతుందని తెలిపారు. ప్లాస్టిక్‌కు బదులుగా పేపర్, బట్ట సంచులను వినియోగించాలని సూచించారు. అనంతరం ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, డీపీఎంఓ డాక్టర్ చత్ర ప్రకాష్ రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల అభిప్రాయంతో దేవాలయాన్ని నిర్మిస్తాం...

- రాజకీయాలు పక్కనపెట్టి జాతరకు సహకరించండి...
- తిరుపతి గంగమ్మకు 1.30 కోట్ల ఫిక్స్డ్ డిపాజిట్లు...
- భక్తులచే 3.260కిలోల బంగారం.. 41కిలోల వెండి...
- భక్తులచే భూదానంకు 65.25లక్షలు.. నాగపడిగకు 10కిలోల పాతవెండి...
- 20న సిఎం చంద్రబాబు దంపతుల రాక..



**కుప్పం – ఆంధ్రనాడు, మే 16:** కుప్పం గ్రామదేవత శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా పలువురు అసత్య ప్రచారాలకు తెర తీశారని, అమ్మవారి ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రచారం చేయడం సబబు కాదని, ప్రజా అభిప్రాయం మేరకే దేవాలయ పునర్నిర్మాణం చేపడతామని ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆలయ కమిటీ చైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు స్పష్టం చేశారు. కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారికి 130కోట్ల మేర ఫిక్స్డ్ డిపాజిట్లు ఉన్నాయని ఆలయ చైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయంలో కడ పొలిటికల్ చైర్మన్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ సభ్యుడు రాజకుమార్ తదితరులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వైకాపా పాలనలో కేవలం 656గ్రా.ల బంగారం, 1,596కిలోల వెండిని మాత్రమే ఆలయ ఇ.ఒ కు అప్పగించి ఉన్నారన్నారు. ప్రస్తుతం అమ్మవారికి 3.260కిలోల బంగారం, 41కిలోల వెండి ఆభరణాలు ఉన్నట్లు చెప్పారు. 2025–26లో ప్రారంభించిన భూదానం కార్యక్రమంకు భక్తులచే 65.25లక్షల విరాళాలు రాగా 88.71లక్షలతో రెండు భవనాలు కొనుగోలు చేసినట్లు చెప్పారు. అలాగే నాగపడిగకు 10.30కిలోల పాతవెండిని భక్తులు అందించారన్నారు. కుప్పంలో తాను ట్రస్టీగా కుప్పం మన అన్నక్యాంటీన్ ట్రస్ట్ నిర్వహిస్తున్నానని ఆ ట్రస్ట్ కు వచ్చిన నిధులకు అన్న క్యాంటీన్ కు సంబంధం లేదన్నారు. ప్రస్తుతం ట్రస్ట్ ఖాతాలో 6లక్షల నిల్వ ఉందన్నారు. తమ పాలకవర్గం ఎలాంటి పొరబాట్లకు తావివ్వలేదన్నారు.



ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ... ఆలయ విషయాల్లో రాజకీయాలు వద్దన్నారు. సమావేశంలో ఇఒ రమణ, మాజీ సర్పంచ్ గోపీనాథ్, మాజీ ఆలయ చైర్మన్ ఆర్ఆర్ రవి, జనసేన ఇన్చార్జ్, కాణిపాకం బోర్డు సభ్యుడు డాక్టర్ బి.వి నరేష్, ఆలయ కమిటీ సభ్యులు జయరాంనాయుడు, వినయ్, జ్యోతీష్, ఆనంద్, శరవణ, పవన్ మహేష్, నరేష్, కందస్వామి, మణి తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ జాతరకు ఈనెల 20న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సీఎం సతీమణి నారా భువనేశ్వరి హాజరవుతారని ప్రభుత్వవిప్, డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. 20న సిఎం దంపతులు అమ్మవారిని ఉదయం 10.30–11.30గంటల మధ్య దర్శించుకునే అవకాశం ఉందన్నారు. అమ్మవారి జాతర ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. గంగజాతర ముగిసిన అనంతరం నేతాజీ రోడ్డు విస్తరణ పనులు మొదలవుతాయన్నారు. వచ్చే ఏడాది జాతర లోగా అమ్మవారి ఆలయాన్ని 8.45కోట్ల వ్యయంతో భక్తుల మనోభావాలకు తగిన రీతిలో స్థపతులతో చర్చించి నిర్మించడం జరుగుతుందన్నారు. భక్తులు ఇచ్చే విరాళాలు, ఆస్తులు, నిధులపై చాలా స్పష్టత ఉందని భక్తుల మనోభావాలను దెబ్బతీయరాదన్నారు. తాము ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేస్తామని అది సిఎం చంద్రబాబు తమకు ఇచ్చిన స్ఫూర్తి అన్నారు.

# భూకబ్జాలపై వైసీపీ వి తప్పుడు ఆరోపణలు

- టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు నదిగం ఉదయ్ కుమార్



**శాంతిపురం – ఆంధ్రనాడు, మే 16 :** వైసీపీ నేతలు తమ ఉనికిని చాటుకోవడం కోసమే కూటమి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండల టీడీపీ అధ్యక్షుడు నదిగం ఉదయ్ కుమార్, కూటమి నాయకులు ఆరోపించారు. శనివారం మండల పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పార్టీ అధ్యక్షుడు మాట్లాడుతూ శుక్రవారం వైసీపీ నాయకులు చేసిన ఆరోపణలపై స్పందిస్తూ వాస్తవాలను పక్కనపెట్టి అనవసరంగా పదేపదే తమ నాయకుడికి చెందిన హెరిటేజ్ సంస్థ ప్రస్తావన తీసుకురావడం మంచిది కాదన్నారు. కూటమి ప్రభుత్వం గానీ నాయకులు గానీ ఈ రెండేళ్ల కాలంలో ఎక్కడ గాని భూకబ్జాలకు దందాలకు పాల్పడింది లేదన్నారు. వైసిపి హయాంలోనే భూ ఆక్రమణలు, దందాలు, సెటిల్మెంట్లు చోటుచేసుకుందన్నారు. ఇందుకు ఉదాహరణ 2019లో అప్పటి మండల కన్వీనర్ గా ఉన్న కోదండ రెడ్డి ఎస్సీలకు సంబంధించిన భూములను లాగేసుకోవడం నిజం కాదా అని ప్రశ్నించారు. అలాగే ప్రస్తుతం ఉన్న మండల పార్టీ కన్వీనర్ బుల్లెట్ దండపాని వెదురుగుట్టపల్లి రెవెన్యూ కడపలి రెవెన్యూలో సుమారు 15 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేయడం నిజం కాదా అని ప్రశ్నించారు. వైసిపి హయాంలో జరిగిన రీ సర్వేలో రైతులకు చెందిన భూములను 22ఏ ఖాతాలోకి నమోదు చేయించి వాటిని సరిదిద్దడానికి ప్రజల నుండి లక్షల రూపాయలు దండుకున్న ఘనత వైసిపి నాయకులదేనని అన్నారు. వైసిపి హయాంలో జరిగిన భూ కబ్జాలపై ఎంక్వయిరీ వేయించి ఆ భూములను ప్రభుత్వం ద్వారా పేదలకు పంచిపెట్టే కార్యక్రమం కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. హెరిటేజ్ భూముల వివాదంపై వివరణ ఇస్తూ హెరిటేజ్ ల్యాండ్స్ 2006 సంవత్సరంలో, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో, కమిషనర్ ఆఫ్ ఇండస్ట్రీస్ హెరిటేజ్ ఫుడ్ ఇండియా లిమిటెడ్‌కు ప్యాక్ హౌస్ మరియు కోల్డ్ స్టోరేజ్ కట్టుకునేందుకు అనుమతి ఇచ్చింది. ఈ అనుమతికి సంబంధించిన డాక్యుమెంట్లు 2006లోనే ఉన్నాయి, రైతులు కూడా అదే సంవత్సరంలో రిజిస్ట్రేషన్ చేయించారు. హెరిటేజ్ సంస్థ బిగ్ బజార్ కు భూమిని విక్రయించింది, ఆ తర్వాత ఎన్సీఎల్‌టీ కంపెనీ వేలం వేయగా, చెన్నై కు చెందిన కమల్ అనే వ్యక్తి 40 ఎకరాలు కొనుగోలు చేశారు అని తెలిపారు. దేవాదాయ భూమిపై స్పష్టమైన అవగాహన లేకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు 13 ఎకరాల దేవాదాయ భూమి ప్రభుత్వ భూమి అని ఆరోపిస్తున్నారని, వాస్తవానికి ఒక 1.19 సెంట్లు మాత్రమే దేవాదాయ భూమి ఉంది. ఈ దేవాదాయ భూమి చౌడేశ్వరమ్మ గుడికి సంబంధించింది దేవాదాయ భూమి ఆక్రమణకు గురి కాలేదని తెలిపారు. 2019–2024 మధ్య జరిగిన రీసర్వేల వల్ల ఎల్పీ నంబర్లు మారిపోయాయి, దీనివల్ల హెరిటేజ్ భూమికి సంబంధించిన నంబర్లు కూడా మారాయి దీనిని ఆసరాగా చేసుకుని తప్పుడు సమాచారం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించడానికి వైఎస్సార్‌సీపీ చేస్తున్న ప్రయత్నమని పేర్కొన్నారు. అనవసరమైన ఆరోపణలు చేస్తే ప్రభుత్వ పరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిఎస్ సిఎస్ చైర్మన్ గోపాల్, నాయకులు గజేంద్ర, చంద్రశేఖర్, మంజునాథ్, నాగరాజు, ఆర్ఎస్ మనీ, గోవిందరాజులు, లోకేష్, హరినాథ్ రెడ్డి, శివశంకర్, రమేష్, దాము, శ్రీనివాసులు, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సురక్షిత డ్రైవింగ్‌తో ఇంధన ఆదా మార్గాలు

- ప్లాస్టిక్ నిషేధం, ఇంధన పొదుపుపై అవగాహన
- జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్

తిరుపతి రూరల్ – ఆంధ్రనాడు, మే 16: తిరుపతి జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వాహనదారులకు ప్లాస్టిక్ నిషేధం, ఇంధన పొదుపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ మాట్లాడుతూ, సురక్షిత డ్రైవింగ్‌తో ఇంధన ఆదా మార్గాలని పెరుగుతున్న ఇంధన వినియోగం, పెట్రోల్–డీజిల్ ధరల పెరుగుద ల, పర్యావరణ కాలుష్యం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపును సామాజిక బాధ్యతగా స్వీకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇంధనం దేశ ఆర్థిక వ్యవస్థకు మూలాధారమని ఆయన పేర్కొన్నారు. మోటారు వాహన తనిఖీ అధికారి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అవసరం లేని సమయంలో వాహనాన్ని ఐడిల్‌లో ఉంచకూడదని, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఇంజిన్ ఆఫ్ చేయాలని సూచించారు.



అలాగే సాఫీ డ్రైవింగ్ అలవాటు చేసుకోవడం ద్వారా ఇంధనం ఆదా అవుతుందని తెలిపారు. అదే విధంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వాహనాలను క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేయించుకోవడం, టైర్ల గాలి ఒత్తిడిని సరిచూసుకోవడం ద్వారా ఇంధన వినియోగాన్ని తగ్గించవచ్చని వివరించారు. వాహన తనిఖీ అధికారి అతికా నాజ్ మాట్లాడుతూ చిన్న దూరాలకు నడక లేదా సైకిల్ వినియోగించడంతో పాటు కార్ పూలింగ్ విధానాన్ని పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, వాహనదారులు పాల్గొని ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు.



5
ANDHRANADU
TELUGU DAILY
ఆదివారం
17.05.2026
తిరుపతి – చిత్తూరు
అన్నమయ్య– అనంతపురం
ఆంధ్రనాడు

# ప్రకృతి కోసం ప్లాస్టిక్‌ను వీడుదాం

- ఏర్పేడు బస్టాండులో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం
- ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని ప్రజలకు కలెక్టర్ సూచన





**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 16:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. శనివారం ఏర్పేడు బస్టాండు కూడలిలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ సంచులు, ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల వినియోగం పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తోం దని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల భూమి, నీరు, గాలి కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోందని ఆయన పేర్కొన్నారు. పర్యావరణ హిత జీవనశైలిని అలవాటు చేసుకోవాలని సూచించిన కలెక్టర్, గుడ్డ సంచులు, జూట్ బ్యాగులు వంటి పునర్వినియోగ వస్తువులను వినియోగించాలని ప్రజలకు సూచించా రు. అలాగే ఇంటి వద్ద నుంచే చెత్తను వర్గీకరించి ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రత్యేక చెత్త బుట్టల్లో వేయాలని ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర--స్వచ్ఛ తిరుపతి కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తూ ప్రజల్లో పరిశుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన పర్యావరణా న్ని అందించేందుకు అందరూ కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి, తహసీల్దార్, ఎంపీడీఓ, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రుణాల పంపిణీకి బ్యాంకర్లు చొరవ చూపాలి

- లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ఆంజనేయులు




**తంబళ్లపల్లె – ఆంధ్రనాడు, మే 16:** వివిధ ఆర్థిక మద్దతు పథకాల లక్ష్య సాధనకు రుణాలు అందించడంలో బ్యాంకర్లు చొరవ చూపాలని లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో నియోజకవర్గం లోని బ్యాంకు అధికారులు, వెలుగు ఏపీఎంలతో సమీక్ష నిర్వహించారు. 2026-27వార్షిక రుణ ప్రణాళికలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకుల నుంచి రుణాలు పొందిన వారు ఇన్సూరెన్స్ భీమా తప్పనిసరిగా చేసుకునే విదంగా బ్యాంకు అధికారులు కృషి చేయాలని అన్నారు. పంట రుణాలు, దీర్ఘ కాలిక రుణాలకు సైతం ఇన్సూరెన్స్ తీసుకుంటే విపత్కర పరుణామాలు జరిగినపుడు ఇన్సూరెన్స్ భీమా పొంది కొంత ఊరట చెందగలరన్నారు. ఈ విషయాలను రైతులకు వివరించి భీమా చేసుకునే విదంగా చైతన్య పరచాలన్నారు. జిల్లాలో గత 2025-26 ఆర్థిక సంవత్సరంలో అన్ని రుణాలు పంపిణీ రూ. 16,619 కోట్లు లక్ష్యం కాగా రూ. 19,962 కోట్లు పంపిణీ చేసి 120శాతం ఫలితాలు సాధించినట్టు తెలిపారు. పీఎంఎస్ఎంఈ, పీఎంఈజీపీ, వ్యవసాయ రాయితీ రుణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా పరిశ్రమల అధికారి శంకరప్ప మాట్లాడుతూ.. ఇండస్ట్రీయల్స్ స్థాపించాలనుకునే నిరుద్యోగ యువతకు ఎంఎస్ఎంఈ ద్వారా ప్రభుత్వం 45% సబ్సిడీతో రుణాలు ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకునే విదంగా బ్యాంకు, వెలుగు అధికారులు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వెలుగు ఏపీఎం రమేశ్, మండల వ్యవసాయ శాఖాధికారి రమణ కుమార్, ఏపీఎంలు గంగాధర్, హరి, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ యువ నేత కిషోర్ కుమార్ రెడ్డికి రాష్ట్ర స్థాయిలో కీలక పదవి

-వైసీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా నియామకం





**తంబళ్లపల్లి – ఆంధ్రనాడు, మే 16:** అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెకు చెందిన వైసీపీ యువనేత కిషోర్ కుమార్ రెడ్డికి రాష్ట్ర స్థాయిలో కీలక పదవి దక్కింది. వైసీపీ రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీగా కిషోర్ రెడ్డిని నియమిస్తూ వైసీపీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన వైసీపీ అధినేత మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో యువతను కలుపుకుని రాష్ట్ర స్థాయి నుంచి పార్టీ బలోపేతం చేసుకుంటూ అందరి సహకారంతో రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల గెలుపుకు యుద్ధ సైనికుడిలా పని చేస్తానని కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. కిషోర్ కుమార్ రెడ్డికి రాష్ట్ర స్థాయి పదవి రావడం పట్ల తంబళ్లపల్లి నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. కాగా కిషోర్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి వెన్నంటి ఉంటూ వైసీపీ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ తంబళ్లపల్లి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి విశేషంగా కష్టపడ్డాడు.

# 21నుండి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- నిర్వహణపై జిల్లా యంత్రాంగం సన్నద్ధత
- పకడ్బందీ నిర్వహణపై జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు సమీక్ష






**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 16:** ఈ నెల 21నుండి జూన్ 04 వరకు జిల్లాలో జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ రాత పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు తెలిపారు. శనివారం ఉదయం తిరుపతి కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పరీక్షలను ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని వెల్లడించారు. ఈ పరీక్షలు మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, రెండవ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో సమయపాలనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలో మొత్తం 52 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, 34,380 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. పరీక్షల సజావుగా నిర్వహణ కోసం మూడు డిప్యూటీ తహశీల్దార్లను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వాచీలు, వైర్లెస్ హెడ్‌సెట్లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు పూర్తిగా నిషేధించినట్లు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు, త్రాగునీరు, టాయిలెట్ సౌకర్యాలు, నిరంతర విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతులు సక్రమంగా ఉండేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థుల రవాణా సౌకర్యాల కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి ఎలాంటి ఆలస్యం లేకుండా పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్ఐఓ రాజశేఖర్ రెడ్డి, తిరుపతి సహా సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జలధార-జల హారతి పనులు వేగవంతం చేయండి - డ్వామా పీడీ వెంకట రత్నం





**తంబళ్లపల్లి - ఆంధ్రనాడు, మే 16:** నీటి సంరక్షణ,భూ గర్భ జలాల పెంపు లక్ష్యంగా చేపట్టిన జల ధార-జల హారతి పనులను వేగవంతం చేయాలని డ్వామా పీడీ వెంకట రత్నం అన్నారు. శనివారం పీడీ తంబళ్లపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత కన్నెమడుగు, పరశు తోపు, తంబళ్లపల్లి గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న సప్లై ఛానల్, ఫీడర్ ఛానల్ పనులను పరిశీలించారు. పనులు నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేసి జిల్లాలోనే ఆదర్శంగా నిలపాలని అన్నారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో బిల్లులు పడుతున్నాయా? వేతనాలు సరిగ్గా అందుతున్నాయా? లేదా అని ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ 125 రోజులు పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పనులు చేయాలని సూచించారు. మండలంలో జాబ్ కార్డు వున్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్వర్ణా ంధ్ర విజన్ 2047 లో భాగంగా మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, మసీదు వీధి, సాలె వీధి, శ్రీనివాస కాలనీల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తదనం తరం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నా రు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవి. ప్రసాద్, ఏపీఓ అంజనప్ప, పీఆర్ ఏఈ వెంకటరమణ, డిప్యూటీ ఎంపీడీఓలు మారుతీ ప్రసాద్, ఈసీ మహేష్, కార్యదర్శి శ్రీనివా స రావు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డ్రై డే పాటించండి.. ఆరోగ్యంగా ఉండండి

- జాతీయ డెంగ్యూ దినోత్సవం అవగాహన ర్యాలీలో డీఎంహెచ్‌వో



**తిరుపతి రూరల్ – ఆంధ్రనాడు, మే 16:** జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా తిరుపతి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో డాక్టర్ వి. బాలకృష్ణ నాయక్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ జి.కె. రూప్ కుమార్ అధ్యక్షతన అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ వ్యతిరేక నినాదాలతో నిర్వహించిన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ వి. బాలకృష్ణ నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల కూడలి వద్ద శ్రీ పద్మావతి నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, సిబ్బంది మానవహారం నిర్వహించి డెంగ్యూ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ, డెంగ్యూ నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని డ్రై డే పాటించండి – ఆరోగ్యంగా ఉండలని పేర్కొన్నారు. ఈడిస్ ఈజిప్టై దోమ కాటు ద్వారా డెంగ్యూ వ్యాపిస్తుందని, ముఖ్యంగా వర్షాకాలంలో వ్యాధి ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటిస్తూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, కొబ్బరి బోండాలు, వాడిపడేసిన వస్తువులు ఇంటి పరిసరాల్లో పేరుకుపోకుండా పరిశుభ్రత పాటించాలని ఆయన సూచించారు. కిటికీలకు జాలీలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు దోమల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పన్ను తగ్గితే ప్రజలకు ఊరట

ఇంధనంపై పన్నుల భారమే సామాన్యుడి జీవితానికి పెరుగుతున్న మోత





**పీలేరు – ఆంధ్రనాడు, మే 16:** దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు రోజురోజుకూ పెరుగుతూ సామాన్య ప్రజల జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల పెరుగుదల ఒక కారణం అయినప్పటికీ, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న అధిక పన్నులే అసలు భారమని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఒక లీటర్ పెట్రోల్ ధరలో దాదాపు సగభాగం పన్నుల రూపంలోనే వసూలవుతోంది. కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీ పేరుతో భారీ మొత్తాలను వసూలు చేస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాట్, సెస్ తదితర పన్నులతో అదనపు భారం మోపుతున్నాయి. ఈ ద్వంద్వ పన్నుల ప్రభావం రైతులు, చిన్న వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్రంగా పడుతోంది. డీజిల్ ధరల పెరుగుదలతో వ్యవసాయ ఖర్చులు గణనీయంగా పెరిగాయి. ట్రాక్టర్లు, పంపుసెట్లు, రవాణా వాహనాలు డీజిల్‌పైనే ఆధారపడటంతో రైతుల ఉత్పత్తి వ్యయం పెరుగుతోంది. రవాణా ఖర్చులు పెరగడంతో కూరగాయలు, ధాన్యం, నిత్యావసర వస్తువుల ధరలు కూడా అధికమవుతున్నాయి. చివరకు ఈ భారం మొత్తం సామాన్య వినియోగదారుడిపైనే పడుతోంది. పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని చాలా కాలంగా డిమాండ్లు వస్తున్నాయి. అలా చేస్తే దేశవ్యాప్తంగా ఒకే విధమైన పన్ను విధానం అమలై, లీటర్‌కు రూ.15 నుంచి రూ. 25 వరకు ధరలు తగ్గే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ధరలు తగ్గితే రవాణా రంగానికి ఊరట లభించడమే కాకుండా ద్రవ్యోల్బణం కూడా తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. భారతదేశంలో రాష్ట్రానికొక విధంగా ఇంధన ధరలు ఉండటానికి ప్రధాన కారణం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు విధించే వ్యాట్, సెస్ మరియు ఇతర స్థానిక పన్నులే. కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీ విధించిన తర్వాత రాష్ట్రాలు తమ వాటా పన్నులను జోడించడం వల్ల దేశవ్యాప్తంగా ధరల్లో భారీ తేడాలు కనిపిస్తున్నాయి. తెలంగాణ, మహారాష్ట్ర, రాజస్థాన్, కేరళ వంటి రాష్ట్రాల్లో అధిక పన్నుల కారణంగా పెట్రోల్ ధరలు లీటర్‌కు రూ.105 నుంచి రూ.110 దాటుతున్నాయి. తెలంగాణలో పెట్రోల్‌పై సుమారు 35 శాతం వరకు వ్యాట్ ఉండగా, డీజిల్‌పైనా అధిక పన్నులు అమలులో ఉన్నాయి. మహారాష్ట్రలో ముంబై వంటి నగరాల్లో అదనపు స్థానిక పన్నుల వల్ల ధరలు మరింత పెరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై సుమారు 31 శాతం వ్యాట్‌తో పాటు అదనపు సెస్ ఉండగా, డీజిల్‌పై కూడా 22 శాతం పైగా పన్నులు అమలులో ఉన్నాయి. తమిళనాడులో వ్యాట్‌తో పాటు స్థిర పన్నులు, కేరళలో రాష్ట్ర ఆదాయ వనరుల కోసం అధిక పన్నులు కొనసాగుతున్నాయి. కర్ణాటకలో ఇటీవల పన్నుల పెంపుతో బెంగళూరు వంటి నగరాల్లో ధరలు మరింత పెరిగాయి. ఇక ఢిల్లీ, గుజరాత్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో తక్కువ వ్యాట్ కారణంగా ప్రజలకు కొంత ఉపశమనం లభిస్తోంది. ఈశాన్య రాష్ట్రాల్లో అరుణాచల్ ప్రదేశ్, అండమాన్ ఉ నికోబార్ ప్రాంతాల్లో తక్కువ పన్నుల వల్ల దేశంలోనే అత్యల్ప ఇంధన ధరలు నమోదవుతున్నాయి. మొత్తంగా చూస్తే, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న అధిక పన్నులే పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడానికి ప్రధాన కారణంగా మారాయి. పన్నులను తగ్గిస్తే రైతులకు, మధ్యతరగతి కుటుంబాలకు, రవాణా రంగానికి, చిన్న వ్యాపారులకు భారీ ఊరట లభించే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. బోదీషా వాలి డివియంసి సభ్యులు, అన్నమయ్య జిల్లా "ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంధనంపై పన్నులను తగ్గిస్తే సామాన్యుడి జీవితం కొంతైనా సులభమవుతుంది. రైతు నుంచి ఉద్యోగి వరకు ప్రతి వర్గానికీ ఇది పెద్ద ఊరటనిస్తుంది. దేశ అభివృద్ధి అంటే కేవలం ఆదాయం పెరగడం కాదు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటమే నిజమైన అభివృద్ధి."

# చంద్రగిరి అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే నాని, కలెక్టర్ తో సమీక్ష



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 16:** చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై ఎమ్మెల్యే పులివర్తి నాని, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న రహదారుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సేవా కార్యక్రమాలు, అలాగే పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల పురోగతిపై వివరంగా చర్చించారు. పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై ఎమ్మెల్యే నాని, కలెక్టర్ తో సమగ్రంగా సమీక్షించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు త్వరితగతిన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పులివర్తి నాని కలెక్టర్‌ను కోరారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి అవసరమైన అన్ని సహకారాన్ని అందించాలని ఆయన కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.

# టీటీడీకి ఎలక్ట్రిక్ బస్సు విరాళం



**తిరుమల – ఆంధ్రనాడు, మే 16 :** చెన్నైకు చెందిన వర ఫ్యూచర్ ఎల్ఎల్పీ సంస్థ చైర్మన్ వర్ధమాన్ జైన్ శనివారం ఉద యం టీటీడీకి ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సును విరాళంగా అందించారు. ఈ మేరకు దాత శ్రీవారి ఆలయం ముందు బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించి బస్సుకు సంబంధించి న పత్రాలు, తాళాలను టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరికి అందజేశారు. ఈ సందర్భంగా అదనపు ఈవో దాతతో కలిసి బస్సులో ప్రయాణించి, ప్రయాణికులకు ఈ బస్సు చాలా సౌకర్యవంతంగా ఉందని దాతను అభినందించారు. కాగా ఈ బస్సును తిరుమలలోని భక్తుల సౌకర్యార్థం ఉచిత బస్సు గా వినియోగించ నున్నారు.ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, టీటీడీ మాజీ బోర్డు సభ్యులు డి.పి.అనంత, తిరుమల ట్రాన్స్ పోర్ట్ డీఐ కృష్ణయ్య పాల్గొన్నారు.

# పీలేరులో మినీ మహానాడు రద్దు

## నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి



**పీలేరు – ఆంధ్రనాడు, మే 16:** పశ్చిమాసియా లో నెలకొన్న యుద్ధ పరిస్థితులు మరియు దేశం లో చమురు పొదుపు అవసరాన్ని దృష్టిలో ఉంచు కుని, ఈ నెల 27, 28, 29 తేదీల్లో నెల్లూరులో జరగాల్సిన తెలుగుదేశం పార్టీ మహానాడు కా ర్యక్రమాన్ని రద్దు చేసి ఆన్‌లైన్ విధానంలో నిర్వ హించాలని పార్టీ నిర్ణయించింది. దీనిలో భాగంగా పార్లమెంటు నియోజకవర్గాల వారీగా 18, 19, 20 తేదీల్లో జరగాల్సిన మహానాడులతో పాటు, ఈ నెల 18న పీలేరు నియోజకవర్గంలో నిర్వహిం చాల్సిన మినీ మహానాడు కార్యక్రమాన్ని కూడా రద్దు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 27, 28 తేదీల్లో మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్ నుంచి కేవలం పొలిట్ బ్యూరో సభ్యులు మాత్రమే పాల్గొనే ఈ కార్యక్రమాన్ని, రాష్ట్రంలోని సుమారు 1,845 క్లస్టర్లలో పెద్ద స్క్రీన్ల ద్వారా కార్యకర్తలకు ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. చమురు పొదుపే ప్రధాన లక్ష్యంగా పార్టీ ఈ నిర్ణయం తీసుకుందని, నాయకులు మరియు కార్యకర్తలు సహకరించాలని ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి కోరారు.

# విద్యుత్ టవర్ల నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యం



**తిరుపతి, ఆంధ్రనాడు, మే 16:** ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల కు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. ఎపిఎస్పిసిడిసిఎల్ కా ర్పొరేట్ కార్యాలయంలో శనివారం ఉదయం టవర్ల నిర్మాణ కాంట్రాక్టర్లతో సిఎండి శి వశంకర్ లోతేటి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ సంస్థ పరిధిలోని చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాల్లో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం వున్న ప్రాంతాలు, సాంకేతికంగా అవసరం వున్న ప్రాంతాల్లో విద్యుత్ టవర్ల నిర్మాణానికి టెండర్లను ఆహ్వానించి, టెండర్లను ఖరారు చేయడం జరిగిందన్నా రు. అయితే టవర్ల నిర్మాణంలో నాణ్యతను మరింత పెంపొందింపజేసేందుకు వీలుగా ఆ పనులను చేపట్టే ముందు సంబంధిత కాంట్రాక్టర్లతో సమీక్షను నిర్వహిస్తున్నామని తెలిపారు. టెండరు డాక్యుమెంట్, అగ్రిమెంట్ లో పేర్కొన్న విధంగా ఎం–టైప్ జిఐ టవర్ల బరువు 2.40 మెట్రిక్ టన్నులు, ఎం9 టవర్ల బరువు 2.80, ఎం12 టవర్ల బరువు 3.38 మెట్రిక్ టన్నులు ఖచ్చితంగా వుండాలన్నారు. అదేవిధంగా టవర్ల గా ల్వనైజేషన్ నిర్దేశించిన మేరకు వుండాలన్నారు. టవర్ల నిర్మాణానికి వినియోగించే పరికరాల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. టవర్ డిజైన్, టవర్ల మధ్య నిర్దేశిత దూరం ఖచ్చితంగా వుండే విధంగా పనులను చేపట్టాలని కోరారు. ఈ పనుల పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని వివరించారు. టవర్ల నిర్మాణంలో ఏవైనా మార్పులు అవసరమైతే తప్పకుండా ఆ కమిటీ నుంచి అనుమతిని పొందాలని, పనుల్ని ఏడాదిలోగా పూర్తి చేయాలని సూచించారు. పనులను చేపట్టే సందర్భాల్లో ఏవైనా అడ్డంకులు ఏర్పడినట్లయితే సంబంధిత జిల్లా కలెక్టర్, ఆర్డిఓ, సంబంధిత సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్లను సంప్రదించి, సమస్యల్ని పరిష్కరించుకుని, పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ & ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ & హెచ్ఆర్డి) కె. గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్ జె. రమణా దేవి, జనరల్ మేనేజర్లు శ్రీనివాసులు, జగదీష్, కాంట్రాక్టర్లు అభిషేక్, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

# మురికి కాలువ లేక గ్రామాల్లో ఇబ్బందులు

- పుంగనూరు పట్టణం భగత్ సింగ్ కాలనీలో నివసిస్తున్న మహిళల ఆవేదన
ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చిన మా వీధి లో మురికి కాలువల గురించి పట్టించుకోని
- మున్సిపల్ అధికారులు రాజకీయ నాయకులు
- 35 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నామని మా బాధ ఎవరికి చెప్పుకోవాలి




**పుంగనూరు– ఆంధ్రనాడు, మే 16**

పుంగనూరు పట్టణం భగత్ సింగ్ కాలనీలో ప్రభుత్వ పాఠశాల అంగన్వాడి సెంటర్‌కు మధ్యలో గల వీధిలో మురికి కాలువ లేక గత 35 సంవత్సరాలుగా బాధపడుతున్నామని మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న ఎవరు పట్టించుకోవడంలేదని ఆ వీధిలో గల మహిళలు మీడియాకు తెలిపారు. వారు సందర్భంగా మాట్లాడుతూ మా బాత్రూం లు, లెట్రిన్ల లో నుంచి మురికి నీరు వెళ్లేందుకు కాలువలు లేక పోవడంతో ఇంటి ముందే గుంతలు తొవ్వుకొని అందులో స్టోర్ అయిన మురికి నీరును దుర్వాసన వస్తున్న భరిస్తూ ఆ నీరును బకెట్ల ద్వారా పెద్ద కాలువ ఉన్న చోటుకు తీసుకువెళ్లి వస్తున్నామని వారు బాధ వ్యక్తం చేస్తున్నారు, ఎన్ని సంవత్సరాలు గడిచిన ఏ పార్టీ అధికారంలో ఉన్న ఇంతవరకు మా బాధను మున్సిపల్ అధికారులు గాని రాజకీయ నాయకులు



కానీ ఎవరు పట్టించుకోలేదని, ఎన్నికలు వస్తే ప్రతి ఒక్కరూ వచ్చి మీకు అవి చేస్తాం ఇవి చేస్తాం కాలువలు వేయిస్తాం అని చెబుతున్నారే తప్ప ఇంతవరకు మా వీధి సమస్యల గురించి పట్టించుకున్న పాపన పోలేదని, ఎన్నిసార్లు మున్సిపల్ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినప్పుడు మాత్రం వస్తాం చూస్తామని చెబుతున్నారని, కాలువలు సమస్య పరిష్కారాన్ని తీర్చలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి



సంవత్సరం ఇల్లు టాక్స్ కడుతున్నాం, నీళ్ల టాక్స్ కడుతున్నామని, మాకు న్యాయం చేయనప్పుడు, మా సమస్యలు తీర్చినప్పుడు, టాక్సులు ఎందుకు కట్టాలలి, రాజకీయ నాయకులకు ఓట్లు ఎందుకు వేయాలి, అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# గంజాయి బారి నుండి తిరుపతిని రక్షించుకుందాం..!

- భూమన కుటుంబం నుండి యువతనుకాపాడుకుందాం!

**తిరుపతి – మే 16 (ఆంధ్రనాడు):** గంజాయికి వ్యతిరేకంగా ఉద్యమించిన మహిళలు! ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో యువత జీవితాన్ని నాశనం చేస్తున్న గంజాయి కి వ్యతిరేకంగా తిరుపతి కూటమి పార్టీల మహిళా విభాగాల ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో మహిళలు ఉద్యమించారు. శనివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట శాంతి యుత నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా తెలుగుదేశం, జనసేన కు చెందిన పలువురు మహిళా నాయకురాళ్లు మాట్లాడుతూ భూమన కరుణాకర్ రెడ్డి, అయన కుమారుడు అభినయ్ రెడ్డి ల కనుసన్నలో కొట్లాది రూపాయల గంజాయి వ్యాపారం జరుగుతుందన్నారు. నాలుగు రోజుల క్రితం భూమన అభినయ్ రెడ్డి ప్రధాన అనుచరుడు భాను ప్రకాష్ తిరుపతి రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి అమ్ముతూ.. ఆరు కేజీల గంజాయితో పట్టుబడడమే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యమన్నారు.ఒరిస్సా నుండి వందల కేజీల గంజాయి తెప్పించి పవిత్రమైన తిరుపతిలో అభినయ్ రెడ్డి తన అనుచరుల ద్వారా బస్టాండు రైల్వే స్టేషన్ కాలేజీలు చివరికి స్కూల్ ల వద్ద కూడా గంజాయి అమ్మిస్తూ కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నా





రన్నారు. ఈ గంజాయి వలన యువతీ యువకులు తమ జీవితాలను కోల్పోతున్నారని వారి తల్లి, తండ్రులు మరియు కుటుంబాలు తీవ్రమైన మానసిక క్షోభ అనుభవిస్తున్నాయన్నారు. భూమన కుటుంబం తమ అక్రమ సంపాదన కోసం బిడ్డల జీవితాలను సైతం నాశనం చేయడానికి సిద్ధపడిన ఈ తండ్రి కొడుకులను తిరుపతి నుండి వెలివేయాలని వారు డిమాండ్ చేశారు.గంజాయి వ్యాపారం చేయిస్తున్న భూమన అభినయ్ రెడ్డిపై అతని అనుచరులపై కేసు నమోదు చేయాలని.ఈస్ట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట కార్యదర్శి కుమారమ్మా, పార్లమెంట్ సెక్రటరీ రేవతి..జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అకేపాటి సుభాషిణి, టిడిపి నగర మహిళా విభాగం అధ్యక్షురాలు బ్యాంకు శాంతమ్మ ఇతర మహిళా నాయకులతో పాటు.నగరానికి చెందిన పలువురు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# తిరుపతి పార్లమెంట్ పరిధిలో రైల్వే సమస్యల పై కేంద్ర రైల్వే మంత్రికి విజ్ఞప్తి

-కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన ఎంపీ గురుమూర్తి

**తిరుపతి – ఆంధ్రనాడు, మే 16:** తిరుపతి పార్లమెంట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యల పరిష్కారం, అలాగే డిజిటల్ విద్యా, సైబర్ పరిశోధన రంగాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం కోరుతూ తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కేంద్ర రైల్వే, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను న్యూఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా తిరుపతి, రేణిగుంట, గూడూరు ప్రాంతాలకు సంబంధించిన పలు రైల్వే సమస్యలు పరిష్కరించాలని కోరారు. రేణిగుంట రైల్వే స్టేషన్‌ను ఆధునిక సౌకర్యాలతో కూడిన ప్రధాన టెర్మినల్‌గా అభివృద్ధి చేయాలని, ఇందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎంపీ కోరారు. ప్రయాణికుల కోసం మెరుగైన వసతులు, పార్కింగ్, కార్గో సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. శ్రీకాళహస్తి, నడికుడి రైల్వే లైన్



తుది దశ పనులను వేగవంతం చేయాలని కోరారు. సింహపురి ఎక్స్‌ప్రెస్‌ను గూడూరు నుంచి తిరుపతి వరకు పొడిగించాలని, గూడూరు లోని అంబేద్కర్ నగర్ అండర్‌పాస్ విస్తరణ పనులు త్వరగా చేపట్టాలని, వెందోడు రైల్వే స్టేషన్‌లో కృష్ణా ఎక్స్‌ప్రెస్, పూరి ఎక్స్‌ప్రెస్, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపేజీలు కల్పించాలని కోరారు. తిరుపతి వెస్ట్ రైల్వే స్టేషన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం అత్యవసరమని కూడా వివరించారు.డిజిటల్ విద్య, సైబర్ భద్రత రంగాల్లో తిరుపతిని జాతీయ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దడంలో నైలెట్ కీలక పాత్ర పోషిస్తుందని ఎంపీ గురుమూర్తి తెలిపారు. నైలెట్ తిరుపతి శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు తిరుపతి విమానాశ్రయం సమీపంలోని ప్రతిపాదిత భూమిని త్వరగా స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఆధునిక ప్రయోగశాలలు, పరిశోధన కేంద్రాలు, హాస్టళ్లు, ఇన్నోవేషన్ కేంద్రాల ఏర్పాటు కోసం కనీసం రూ. 300 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రతిపాదించిన "సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ పాలసీ, లా అండ్ టెక్నికల్ రీసెర్చ్ ఇన్ సైబర్ స్పేస్" ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి మద్దతు అందించాలని కోరారు. తిరుపతికి సైబర్ పరిశోధన, డిజిటల్ ఆవిష్కరణల ప్రధాన కేంద్రంగా ఎదిగే సామర్థ్యం ఉందని, కేంద్రం సానుకూలంగా స్పందిస్తే ప్రాంతీయ అభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందని ఎంపీ గురుమూర్తి పేర్కొన్నారు.

# అన్నమయ్య పోలీసుల "ఆపరేషన్ వజ్రప్రహార్" విజయవంతం

**కలకడ/పీలేరు, ఆంధ్రనాడు, మే 16:** ప్రజలకు భద్రత కల్పించడమే లక్ష్యంగా అన్నమయ్య జిల్లా పోలీసులు సరికొత్త వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు. నేడు తెల్లవారు జామున గ్రామం నిద్రలో మునిగిపోయి ఉన్న వేళ కలకడ మండలం బంగారువండ్లపల్లిలో ఒక్కసారిగా పోలీసుల కదలికలు ప్రారంభమయ్యాయి. ఇది సాధారణ తనిఖీ కాదు... నేరరహిత సమాజ నిర్మాణం కోసం చేపట్టిన ప్రత్యేక చర్య "ఆపరేషన్ వజ్రప్రహార్". అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు, రాయచోటి డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్ నాయకత్వంలో పోలీసులు వ్యూహాత్మకంగా ఆపరేషన్ నిర్వహించారు. ఉదయం 4 గంటలకే సుమారు 61 మంది పోలీసు అధికారులు, సిబ్బంది గ్రామంలోకి ప్రవేశించారు. అధునాతన "ఈగల్ టీమ్" డ్రోన్ కెమెరాల ద్వారా గ్రామంలోని ప్రతి ప్రాంతాన్ని గగనతలం నుంచి పర్యవేక్షించారు. డ్రోన్ నిఘాతో అసాంఘిక శక్తులు ఎటు వెళ్లినా తప్పించుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ ఆపరేషన్ కేవలం సోదాల కోసమే కాకుండా, ప్రజల భద్రత కోసం చేపట్టిన చర్యగా పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన సుమారు 210 మంది ప్రజలతో పోలీసులు ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలోకి కొత్త వ్యక్తులు వచ్చినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అవగాహన కల్పించారు. మొత్తం 61 వాహనాలను తనిఖీ చేయగా, పత్రాలు సరిగా లేని 37 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, ఒక కారు, ఒక ట్రాక్టర్ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చట్టం అందరికీ సమానమనే విషయాన్ని పోలీసులు మరోసారి స్పష్టం చేశారు. మాదకద్రవ్యాలు మరియు ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన పాత నేరస్తుల ఇళ్లపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణ మోహన్ తెలిపారు. "తప్పు చేసిన వారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుంది. పీడీ యాక్ట్, పి.ఐ.టి., ఎన్డీపీఎస్ చట్టాల కింద నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుంటాం," అని ఆయన హెచ్చరించారు. ఈ ఆపరేషన్‌లో లక్ష్మన్న, యుగందర్, బి. రాఘవరెడ్డి, అనిల్ కుమార్, రామాంజనేయులు, బి. వెంకట శివ కుమార్, పి.వి. రమణ తదితరులు పాల్గొన్నారు. శాంతియుత సమాజ నిర్మాణం కోసం అసాంఘిక శక్తులపై అన్నమయ్య జిల్లా పోలీసులు చేపడుతున్న ఆపరేషన్ వజ్రప్రహార్ జిల్లా వ్యాప్తంగా నిరంతరం కొనసాగుతుందని ఎస్పీ కార్యాలయం వెల్లడించింది.



# చెలరేగిన బ్యాటర్లు

**- అలెన్, రఘువంశీ, గ్రీన్ అర్ధసెంచరీలు**

**- కోల్ కతా నైట్ రైడర్స్ 247/2**



**కోల్ కతా :** ప్లే-ఆఫ్స్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్ లో కోల్ కతా నైట్ రైడర్స్ బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. కెప్టెన్ రహానే నిరాశపరిచినా.. అలెన్, రఘువంశీ గుజరాత్ బౌలర్లకు చుక్కలు చూపించారు. దీంతో తొలిగా బ్యాటింగ్ కు దిగిన కోల్‌కతా నైట్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 247 పరుగుల భారీ స్కోర్ చేసింది. అలెన్ (93; 35 బంతుల్లో 4 ఫోర్లు 10 సిక్సర్లు), రఘువంశీ (82నాటౌట్; 44 బంతుల్లో 4 ఫోర్లు, 7సిక్సర్లు), కామెరూన్ గ్రీన్ (52నాటౌట్; 28 బంతుల్లో 3 ఫోర్లు, 4సిక్సర్లు) బ్యాటింగ్‌లో విధ్వంసం సృష్టించారు. కెప్టెన్ అజింక్య రహానే (14) విఫలమయ్యాడు. దీంతో ఐపీఎల్ 2026లో కోల్ కతా మరోసారి భారీ స్కోర్ నమోదుచేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్ కతా ఓపెనర్ అలెన్ అలెన్ గుజరాత్ బౌల విరుచుపడ్డాడు. వ్యక్తిగత స్కోర్ 93 పరుగుల వద్ద ఔటై తృటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. ఆ తర్వాత అంగ్‌క్రిష్ రఘువంశీ (82), కామెరూన్ గ్రీన్(52) అర్ధ సెంచరీలతో చెలరేగారు. రఘువంశీకి ఈ సీజన్‌లో ఇది ఐదో అర్ధ సెంచరీ కావడం విశేషం. గుజరాత్ బౌలర్లలో సిరాజ్, సాయి కిషోర్ తలొక వికెట్ పడగొట్టారు.

అహ్మదాబాద్‌లో ఐసిసి సమావేశం

ఐపీఎల్ 2026 ఫైనల్ జరిగే రోజే అహ్మదాబాద్ లో ఐసిసి కీలక సమావేశం కానుంది. మే 21న చీఫ్ ఎగ్జిక్యూటివ్స్ కమిటీ వర్చువల్ సమావేశం నిర్వహించనున్నట్లు.. ఆ తర్వాత మే 30-31 తేదీల్లో ఐసిసి బోర్డు ప్రత్యక్ష సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ప్రపంచ క్రికెట్ బోర్డుల ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. అయితే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ హాజరుపై మాత్రం సందిగ్ధత నెలకొంది. వాస్తవానికి ఈ సమావేశాలను మార్చి లేదా ఏప్రిల్‌లో ఖతార్‌లో నిర్వహించాలని భావించారు.

కానీ యుద్ధం కారణంగా వాయిదా వేశారు. అనంతరం దీనిని అహ్మదాబాద్‌కు మార్చారు. భారత్-పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతినడంతో ఐసిసి సభ్యుడైన నఖ్వీ అహ్మదాబాద్‌కు రాకపోవచ్చనే ఊహాగానాలు విన వస్తున్నాయి. వస్తున్నాయి. మరోవైపు, అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరగనున్న ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌కు నఖ్వీకి ఆహ్వానం పంపినట్లు సమాచారం.

స్కోర్ బోర్డు...

కోల్ కతా నైట్ రైడర్స్ : రహానే (బి)సిరాజ్ 14, అలెన్ (సి)రషీద్ ఖాన్ (బి)సాయి కిషోర్ 93, రఘువంశీ (నాటౌట్) 82, గ్రీన్ (నాటౌట్) 52, అదనం 6. (20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి) 247పరుగులు.

వికెట్ల పతనం: 1/44, 2/139

బౌలింగ్: సిరాజ్ 4-0-50-1, రబడా 4-0-40-0, హోల్డర్ 4-0-39-0, రషీద్ ఖాన్ 4-0-57-0, సాయి కిషోర్ 3-0-38-1, అర్షాద్ ఖాన్ 1-0-22-0.



## మహిళల టీ 20 క్రికెట్ లో ఫాతిమా సనా ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ రికార్డు

**క్రీడలు :** మహిళల టీ 20 క్రికెట్ లో ఫాస్టెస్టు హాఫ్ సెంచరీ నమోదైంది. పాకిస్థానీ మహిళా టీ 20 జట్టు కెప్టెన్ ఫాతిమా సనా రికార్డు ఫాస్టెస్టు హాఫ్ సెంచరీ కొత్త రికార్డు సృష్టించారు. జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో 15 బంతుల్లోనే అర్ధ శతకం బాదారు. ఈ క్రమంలోనే రిచా ఘోష్, సోఫీ డివైన్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (18 బంతుల్లో) రికార్డును ఫాతిమా సనా అధిగమించారు. కరాచీలో జింబాబ్వేతో జరిగిన మూడవ టీ20లో పాకిస్థాన్ కెప్టెన్ ఫాతిమా సనా కేవలం 15 బంతుల్లోనే అర్ధశతకం సాధించి, మహిళల టీ20లలో అత్యంత వేగవంతమైన అర్ధశతకం రికార్డును బద్దలు కొట్టింది. గతంలో 18 బంతుల్లో అర్ధశతకాలు సాధించిన సోఫీ డివైన్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్, రిచా ఘోష్ అనే ముగ్గురు క్రీడాకారిణుల పేరిట ఉన్న రికార్డును సనా అధిగమించింది.

జింబాబ్వేతో జరిగిన ఆఖరి టీ20లో పాకిస్థాన్ బ్యాటింగ్ ఎంచుకున్న తర్వాత, 16.2 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 152 పరుగుల వద్ద బ్యాటింగ్ కు వచ్చిన సనా ధనాధన్ బ్యాటింగ్ తో రికార్డు హాఫ్ సెంచరీ సాధించింది . ఆమె మిషెల్ మవుంగా బౌలింగ్ లో తన మొదటి బంతికే ఫోర్ తో ప్రారంభించి, ఆ తర్వాతి బంతికే సింగిల్ తీసి, కుడ్జాయ్ చిగోరా బౌలింగ్ లో వరుసగా నాలుగు ఫోర్లతో విరుచుకుపడింది. 19వ ఓవర్ లో నోమ్వెలో సిబాండా బౌలింగ్ లో 4, 4, 6, 6, 4 కొట్టి తన జోరును కొనసాగించింది. ఆ ఓవర్ లో 24 పరుగులు రావడంతో, ఇంకా ఒక ఓవర్ మిగిలి ఉండగానే సనా 14 బంతుల్లో 48 పరుగులతో నాటౌట్ గా నిలిచింది. ఈలోగా, మరో ఎండ్ లో సైరా జబీన్ 31 బంతుల్లో 49 పరు గులకు చేరుకుంది. చివరి ఓవర్‌లోని రెండో బంతికి జిమును బౌలింగ్‌లో రెండు పరుగులు తీసి సనా తన చారిత్రాత్మక అర్ధశతకాన్ని పూర్తి చేసు కుంది. ఆ తర్వాత మరో రెండు ఫోర్లతో ఇన్నింగ్స్‌ను ముగించి, కేవలం 19 బంతుల్లో 62 పరుగులతో నాటౌట్‌గా నిలిచింది. ఈ మ్యాచ్‌లో సనా 10 ఫోర్లు, రెండు సిక్సర్లతో రాణించింది. జబీన్ 32 బంతుల్లో 8ఫోర్లతో 50 పరుగులతో నాటౌట్‌గా నిలవగా, పాకిస్థాన్ 4 వికెట్ల నష్టానికి 223 పరుగులు చేసింది. అయేషా జాఫర్ 28బంతుల్లో 9ఫోర్లతో 45 పరుగులు చేసింది.

### చిరంజీవితో ఊటీలో డ్యాన్స్...

## పాత జ్ఞాపకాలను పంచుకున్న మీనాక్షి శేషాద్రి



**చిరంజీవితో కలిసి నటించిన 'లష్కరా' పాటను గుర్తుచేసుకున్న మీనాక్షి శేషాద్రి**

**సోషల్ మీడియాలో పాటకు మళ్లీ డాన్స్ చేసి వీడియో షేర్ చేసిన నటి**

**చిరంజీవి గొప్ప నృత్యకారుడని, ఆయనతో పనిచేయడం ఆనందంగా ఉందని ప్రశంస**

'ఆజ్ కా గూండా రాజ్' సినిమా కోసం ఊటీలో చిత్రీకరించిన పాట ఇది ప్రస్తుతం సినిమాలకు దూరంగా అమెరికాలో నివసిస్తున్న మీనాక్షి శేషాద్రి ఒకప్పటి బాలీవుడ్ ప్రముఖ నటి మీనాక్షి శేషాద్రి, మెగాస్టార్ చిరంజీవితో తనకున్న పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సుమారు 3 దశాబ్దాల క్రితం చిరంజీవితో కలిసి 'ఆజ్ కా గూండా రాజ్' సినిమా కోసం ఊటీలో చిత్రీకరించిన 'లష్కరా' పాట రోజులను గుర్తుచేసుకుంటూ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. ఆ పాటకు మరోసారి స్టెప్పులేస్తూ ఒక వీడియోను అభిమానులతో పంచుకున్నారు.

శుక్రవారం రాత్రి పోస్ట్ చేసిన ఈ వీడియోలో, మీనాక్షి నలుపు రంగు దుస్తుల్లో ఎంతో గ్రేస్‌ఫుల్‌గా డాన్స్ చేస్తూ కనిపించారు. ఈ సందర్భంగా ఆమె చిరంజీవిని ప్రశంసించారు. "చిరంజీవి ఒక గొప్ప నృత్యకారుడు. ఆయనతో కలిసి పనిచేయడం నాకు చాలా ఆనందాన్నిచ్చింది. అందుకే ఆ చిత్రంలో మేమిద్దరం కలిసి చాలా డాన్స్ నంబర్లు చేశాం. 'లష్కరా' పాటను ఊటీలోని అందమైన లొకేషన్లలో చిత్రీకరించాం" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. రవిరాజా పినిశెట్టి దర్శక త్వంలో 1992లో వచ్చిన హిందీ యాక్షన్ చిత్రం 'ఆజ్ కా గూండా రాజ్'. ఇందులో చిరంజీవి, మీనాక్షి శేషాద్రి జంటగా నటించారు. అవినీతి, అన్యాయాలపై ఓ సామాన్యుడు చేసే పోరాటమే ఈ చిత్ర కథ. ఈ సినిమాలోని 'లష్కరా' పాట అప్పట్లో పెద్ద హిట్ అయింది. సుభాష్ ఘాయ్ 'హీరో' చిత్రంతో మీనాక్షి శేషాద్రి బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు.

'దామిని', 'ఘయాల్' వంటి సూపర్ హిట్ చిత్రాలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. కెరీర్ మంచి ఫామ్‌లో ఉన్నప్పుడే సినీ పరిశ్రమకు దూరమై, అమెరికాలో స్థిరపడ్డారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో చురుకుగా ఉంటూ తన పాత జ్ఞాపకాలను అభిమానులతో పంచుకుంటున్నారు. ఈ పోస్ట్‌కు నెటిజన్ల నుంచి మంచి స్పందన వస్తోంది.



## విజయ్ చాలా సరదాగా ఉంటారు

### - మాళవిక మోహనన్

**- విజయ్‌తో కలిసి నటించిన జ్ఞాపకాలను పంచుకున్న మాళవిక**

**- ప్రతి చిన్న విషయంపై విజయ్ దృష్టి పెట్టి నటిస్తారని వెల్లడి**

**- స్టార్ల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నానన్న మాళవిక**

టాలీవుడ్, కోలీవుడ్‌లలో వరుస క్రేజీ ఆఫర్లు అందుకుంటూ హీరోయిన్ మాళవిక మోహనన్ దూసుకుపోతోంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తమిళనాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ పై ప్రశంసల వర్షం కురిపించారు. వారిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన బ్లాక్‌బస్టర్ హిట్ 'మాస్టర్' సినిమా షూటింగ్ జ్ఞాపకాలను ఆమె ఈ సందర్భంగా పంచుకున్నారు. 'మాస్టర్' సినిమా మొదటి రోజు షూటింగ్‌లోనే తనకు చాలా కష్టమైన సీన్ ఎదురైందని, దానివల్ల తన ఫోకస్ మొత్తం డైలాగ్స్‌పైనే పెట్టాల్సి వచ్చిందని మాళవిక తెలిపారు. అయితే, విజయ్ మాత్రం ఎంతటి కష్టమైన సీన్ అయినా సరే.. ఎంతో ప్రశాంతంగా (కూల్‌గా), ప్రతి చిన్న విషయంపై దృష్టి పెడుతూ నటిస్తారని ఆమె కొనియాడారు. సెట్స్‌లో ఆయన అందరితో చాలా సరదాగా ఉంటారని చెప్పారు.

మోహన్ లాల్, రజనీకాంత్, విజయ్ వంటి సీనియర్ మోస్ట్ సూపర్ స్టార్ల నుంచి ఎన్నో విలువైన విషయాలు నేర్చుకున్నానని మాళవిక వెల్లడించారు. ముఖ్యంగా వారి టైమ్ మేనేజ్‌మెంట్, క్రమశిక్షణ తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. ఉదయం 7 గంటలకు షూటింగ్ అని చెబితే.. వారు ఉదయమే 6.55 కల్లా సెట్స్‌లో హాజరవుతారని స్పష్టం చేశారు. అంతటి పెద్ద స్టార్స్ సమయపాలన పాటించడం వల్లే ఇండస్ట్రీలో నిర్మాతలకు భారీగా డబ్బు వృథా కాకుండా ఉంటుందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ANDHRANADU
TELUGU DAILY
ఆదివారం
17.05.2026
తిరుపతి – చిత్తూరు
అన్నమయ్య– అనంతపురం
ఆంధ్రనాడు



## ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై మదనపల్లిలో ధర్నా



**మదనపల్లి-ఆంధ్రనాడు,మే 16:** ఏపీఎస్ఆర్టీసీ లో నెలకొన్న సమస్యలు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఏ పీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శనివారం మదనపల్లి ఆర్ టి సీ డిపోల గేట్ల వద్ద గేట్ మీటింగ్ నిర్వహించి ధర్నా చేపట్టారు.ఈ కార్యక్రమం రాష్ట్ర ఎంప్లాయిస్ యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.వి. కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, పెండింగ్ లోఉన్న డిమాండ్లను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు .ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి బి. సాంబశివ రెడ్డి, జిల్లా జాయింట్ సెక్రటరీ ఎస్.కే. రెడ్డి, జిల్లా ట్రెజరర్ జి. మధుసూదన్, మదనపల్లి-1 డిపో ఈయూ అధ్యక్షుడు కె. శివయ్య, గ్యారేజ్ సెక్రటరీ జి. రాజశేఖర్, మదనపల్లి-2 డిపో సెక్రటరీ సి.ఎ. బాబు, గ్యారేజ్ అధ్యక్షుడు జాఫర్ తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా రెండు డిపోల ఎంప్లాయిస్ యూనియన్ సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు, సభ్యులు, గ్యారేజ్ సిబ్బంది భారీగా హాజరయ్యారు.

## ఇళ్ల వద్ద పరిశుభ్రత పాటించాలి వైద్యాధికారి పూజిత



**రామకుప్పం -ఆంధ్రనాడు, మే 16:**రామకుప్ప0 మండలం విజలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డాక్టర్ పూజిత ఆధ్వర్యంలో జాతీయ డెంగు దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు పరిశీలించండి శుభ్రం చేయండి మూతలు పెట్టండి సందేశాలతో ప్లే కార్డులు ధరించి ప్రజలకు డెంగు వ్యాధి గురించి అవగాహన కల్పించారు ఇళ్ల వద్ద పరిశుభ్రత పాటించాలని దోమతెరలు వాడాలని ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు ఇంటి పరిసర ప్రాంతాలలో టెంకాయ చిప్పలు కుండలు పాత టైర్లు లలో నీరు నిలువకుండా చూడాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో అధికారి శ్రీనివాసన్ రెడ్డి హెల్త్ ఎడ్యుకేటర్ ప్రమీల హెల్త్ అసిస్టెంట్ బాలయ్య ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## శ్రీ శనీశ్వర జయంతి ప్రత్యేక పూజలు



**రామకుప్పం -ఆంధ్రనాడు, మే 16:** శ్రీ శనీశ్వర జయంతి,రామకుప్పంలోని శ్రీ శనీశ్వర దేవాలయం నందు ఉదయమే ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు , ప్రత్యేక అలంకరణ కూడా స్వామివారికి చేశారు,శ్రీ శనీశ్వర జయంతి సందర్భంగా భక్తులు గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు ప్రత్యేకంగా ఈరోజు సాయంత్రం వరకు భక్తులు పూజల్లో పాల్గొన్నారు సమీపంలోని శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యస్వామి దేవాలయం శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో కూడా భక్తులు పూజలు నిర్వహించారు అశ్వత్థ వృక్షాల సముదాయంలో నాగ ప్రతిష్టలు చేసే చోట భక్తులు భారీగా పాల్గొనే పూజలు చేశారు దేవాలయ కమిటీ వారు అన్న ప్రసాదం వితరణ చేశారు.

# బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించిన టీటీడీ ఈవో

**-ఆధ్యాత్మిక శోభ కనిపించేలా ఏర్పాట్లు**
**-మే 27న గరుడ సేవ**
**- మే 30న రథోత్సవం**



**తిరుపతి -ఆంధ్రనాడు, మే 16:** తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు మే 23 నుండి 31వ తేదీ వరకు అత్యంత వైభవంగా, మరింత ఆధ్యాత్మిక శోభ కనిపించేలా నిర్వహించ నున్న నేపథ్యంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను టిటిడి జేఈవో లు వి వీరబ్రహ్మం, డా. ఎ.శరత్, సివిఎస్వో శ్రీ కే వి మురళీకృష్ణ లతో కలిసి టీటీడీ ఈవో శ్రీ ముద్దాడ రవిచంద్ర శనివారం ఆవిష్కరించారు.

తిరుపతిలోని టీటీడీ నివాస గృహంలోని ఈవో ఛాంబర్‌లో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, శ్రీ గోవింద రాజస్వామివారి బ్రహ్మోత్సవాలు భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయ వైభవాలకు ప్రతీకగా నిలిచేలా అన్ని శాఖలు సమన్వయంతో విశేష ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వేసవి దృష్ట్యా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో కళ కళ లాడేలా చలువ పందిళ్లు, ఆకర్ష ణీయమైన విద్యుత్ అలంకరణలు, రంగురంగుల ముగ్గులు, పుష్పాలంకరణలు, వైట్ పెయింటింగ్, సాంప్రదాయ చిత్రకళా అలంకరణలు, ఎల్ఈడీ స్క్రీన్లు తదితర ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.మే 22న సాయంత్రం 5.30 గంటల నుండి 8 గంటల వరకు అంకురార్పణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. మే 23న ఉదయం 7.35 గంటల నుండి 8.49 గంటల వరకు మిథున లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. అదే రోజు రాత్రి పెద్దశేష వాహనంపై స్వామివారు భక్తులకు దివ్య దర్శనమివ్వనున్నారు.

ముఖ్యంగా మే 27న గరుడవాహన సేవ, మే 30న రథోత్సవం బ్రహ్మోత్సవాలకు ఆకర్షణగా నిలవనున్నాయి.

**వాహనసేవల విశేషాలు**

24.05.2026 -- ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం

25.05.2026 -- ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనం

26.05.2026 -- ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం

27.05.2026 -- ఉదయం మోహినీ అవతారం, రాత్రి గరుడ వాహనం

28.05.2026 -- ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజ వాహనశీ

29.05.2026 -- ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం

30.05.2026 -- ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం

31.05.2026 -- ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం

బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్ట్, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించ నున్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వి.ఆర్. శాంతి, ఏఈవో ఏబీ నారాయణ చౌదరి, ఆలయ అర్చకులు ,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరచే కుట్రలు

**- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణప్ప ఆరోపణలు**




**మదనపల్లి-ఆంధ్రనాడు,మే 16:** గ్రామీణ పేదల జీవనాధారంగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (ఎంఎన్ఆర్ఈజీఎస్) కేంద్ర ప్రభుత్వం దశలవారీగా నిర్వీర్యం చేయడానికి కుట్రపూరిత చర్యలు చేపడుతోందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపు కృష్ణప్ప ఆరోపించారు.

అన్నమయ్య జిల్లా తంబాలపల్లి నియోజకవర్గం బి.కొత్తకోట మండలం వీరంగి గ్రామంలో శనివారం జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీల ఉద్యమాల ఫలితంగానే ఉపాధి హామీ చట్టం అమలులోకి వచ్చిందన్నారు. పేదలకు పనైనా పెట్టండి,తిండైనా పెట్టండి" అనే నినాదంతో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు జరిగిన ఉద్యమాల ఒత్తిడితోనే 2005లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ప్రభుత్వంపై వామపక్ష పార్టీలు ఒత్తిడి తీసుకువచ్చాయని గుర్తు చేశారు.

ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 20 కోట్ల మంది కూలీలు ఈ పథకంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. అయితే బీజేపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని బలహీనపరచడానికి పలు మార్గాల్లో ప్రయత్నిస్తోందని విమర్శించారు. చట్టబద్ధ హక్కును సాధారణ పథకంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, రాజ్యాంగ పరిరక్షణను తగ్గించే విధానాలు అమలు చేస్తున్నారని ఆరోపించారు.

మహాత్మా గాంధీ పేరును తొలగించి కొత్త పేర్లతో మార్పులు చేయడం కూడా ఆ కుట్రలో భాగమేనన్నారు.



కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం నిధులు భరించాలనే నిబంధనల వెనుక రాజకీయ ఉద్దేశాలున్నాయని విమర్శించారు. దీని వల్ల ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాలపై భారం పెరిగి పనులు తగ్గిపోతాయని తెలిపారు.

గతంలో ఉపాధి పనుల్లో కూలీలకు అవసరమైన సౌకర్యాలు, పనిముట్లు అందించేవారని, పని పూర్తయిన వెంటనే వేతనాలు ఖాతాల్లో జమ అయ్యేవని గుర్తు చేశారు. ప్రస్తుతం నెలలు గడిచినా వేతనాలు అందడం లేదని, దీనివల్ల గ్రామీణ పేదలు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

"పని చేయించిన వెంటనే కూలి ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత. కానీ ఇప్పుడు కూలీలను తిరుగులాడిస్తూ అవమానించే పరిస్థితి ఏర్పడింది" అని విమర్శించారు. గ్రామ సభల అధికారాలను తగ్గిస్తూ పనుల నిర్ణయాలను అధికార యంత్రాంగం కేంద్రీకరిస్తోందని తెలిపారు.

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకే పని చేస్తోందని, పేదల సంక్షేమ పథకాలను కుదించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు భారీ రుణాలను రద్దు చేస్తూ, గ్రామీణ పేదల ఉపాధిని కోత పెట్టడం దారుణమన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచి గ్రామీణ కూలీలను చౌక కార్మికులుగా మారుస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం చేస్తున్న పోరాటంలో కూలీలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎస్. మనోహర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్. బషీర్ ఖాన్,రమణమ్మ, నాగమ్మ, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P., Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733